



నెల్లూరులో భవానీ భక్తుల ప్రదర్శన

సరస్వతీ దేవతాయై నమః

చదువుల తల్లి సరస్వతీ అలంకరణలో దేవేరులు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొనగా, అమ్మవారి నామస్మరణలు మారుమోగాయి. నవావరణ పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సంపుటీకరణ, చండీ హోమాలు, విశేష పూలంగి సేవలు తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. కొన్ని ఆలయాల్లో సామూహిక విద్యాభ్యాసం జరిగింది. భారీ సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొనగా, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే రాత్రి శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో అర్ధమండలి దుర్గామాల కలిశాల ఊరేగింపు వైభవంగా జరిగింది. జై భవానీ... జైజై భవానీ అంటూ భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.



నెల్లూరు : సరస్వతీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



నెల్లూరు : పెన్నులు, పుస్తకాలతో కన్యకా పరమేశ్వరికి సరస్వతీ అలంకారం

ఈకేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన వారంతా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ గంగా భవాని ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉపాధి'లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధి విధానాలను రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన వారంతా ఫొటోలు తీసి ఆధార్ సర్వేతో లింకు చేసి ఈకేవైసీ చేసుకోవాలన్నారు.


'సోమశిల'కు పెరిగిన వరద ప్రవాహం

అనంతసాగరం సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం 11,560 క్యూసెక్కులు ఉండగా సోమవారం నాటికి 24,486 క్యూసెక్కులుగా నమోదైనట్లు జలాశయ అధికారులు తెలిపారు. ఇక డ్యాంలో 73.224 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, క్రస్ట్‌గేట్ల ద్వారా 23,000 ఉత్తర కాలువకు 150, కండలేరుకు వరద కాలువ ద్వారా 6,000 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు.

క్రీడాకారుల ఉజ్వల భవితకు ప్రణాళికలు

● రాష్ట్ర ట్రైబల్ స్పోర్ట్స్ అధికారిణి రమణి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి, క్రీడాకారులు ఉజ్వలభవిత కోసం ప్రభుత్వం నూతన ప్రణాళికలు సిద్ధం చేసిందని శాప్ డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్ర ట్రైబల్ స్పోర్ట్స్ అధికారిణి ఎస్వీ.రమణి అన్నారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో నాలుగు క్రీడా అకాడమీలను పునఃస్థాపన కోసం ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం ఆమె నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న తరుణంలో వాటిని సరైన పద్ధతుల్లో వినియోగించి భావి క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్ కోసం పక్కా ప్రణాళికలతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఆగిపోయిన క్రీడా అకాడమీలను పునఃస్థాపన చేసి క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనికోసంగా రాష్ట్రంలోని ఆయా జిల్లాలను పరిశీలించి క్రీడామైదానాలు అభివృద్ధి, అకాడమీ భవనాల సుందరీకరణ చేపట్టి క్రీడాహబ్‌లను నిర్మించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం డీఎస్ఏ సిబ్బంది పలు సమస్యలను శాప్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు అనంతరం పలు అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె చర్చించడంతో పాటు స్టేడియంలో ఉన్న వసతులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఆర్‌కె.యతిరాజ్, శాప్ కోచ్‌లు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



విస్తరిస్తున్న గోల్డ్ ట్రాప్ ముఠాలు

చౌక బంగారం పేరుతో పలుచోట్ల దోపిడీలు

నెల్లూరు జిల్లా కేంద్రంగా మొదలై ఇతర ప్రాంతాలకు వ్యాప్తి

వలవేసి బాధితులను బెదిరించి.. ఆపై దాడులు ● రూ.కోట్లు కాజేస్తున్న దొంగల గ్యాంగులు ● పోలీసుల ఉదాసీనతపై విమర్శలు

పోలీసు లాఠీలు, హ్యాండ్ కఫ్స్, పెద్ద తల్వార్(కత్తి), వాకీటాకీలు, పోలీసు యూనిఫాం, క్యాష్ కౌంటింగ్ మెషీన్లు, పిస్టళ్లు.. ఇవన్నీ ఏంటని అనుకుంటున్నారా..! నెల్లూరు జిల్లా కావలిలోని ఓ ఇంట్లో పోలీసులు ఇటీవల సోదాలు చేసిన సమయంలో దొరికిన ఆయుధాలు, వస్తువులు అవి. ఆ ఇల్లు.. తక్కువ ధరకు బంగారం పేరుతో భారీ మోసాలకు పాల్పడే గోల్డ్ ట్రాప్ గ్యాంగ్స్ ప్రధాన నాయకుడిది. పోలీసులు ఆ ఇంట్లోకి సోదాలకు వెళ్లే సమయంలో గ్యాంగ్ అనుచరులు అడ్డుకోగా, అతికష్టం మీద ఇంటి లోపలికి వెళ్లగలిగారు. కావలి కేంద్రంగా కొన్నేళ్ల క్రితం మొదలైన ఈ ముఠా మోసాలు క్రమేణా విస్తరిస్తున్నాయి. మొదట్లో ఒక్క గ్యాంగ్ మాత్రమే ఉండగా, ఇప్పుడు మూడు గ్యాంగులయ్యాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధాన గ్యాంగ్ కావలి కేంద్రంగా ఉంటూనే ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడుతుండగా, మరో గ్యాంగ్ హైదరాబాద్ కేంద్రంగా దందా చేస్తోంది. మూడో గ్యాంగ్ ఇప్పుడు నెల్లూరు కేంద్రంగా పంజా విసురుతోంది. ఈ గ్యాంగులు గత కొన్ని నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో ట్రాప్‌లు వేసి, రూ. కోట్లు దోచుకున్నట్లు, ఈ సమాచారం మొత్తం పోలీసుల వద్ద ఉన్నట్లు తెలిసింది.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) :విజయవాడకు చెందిన ఓ డాక్టర్‌ను కావలి ముఠా గతంలో కర్నూలులో ట్రాప్ చేసింది. తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెప్పి అక్కడకు రప్పించి ఏకంగా రూ. 7.32 కోట్లు తీసుకొని నకిలీ బంగారాన్ని అంటగట్టింది. ఇది తెలిసి బాధితుడు తన డబ్బులు తనకు ఇచ్చేయాలని కోరగా, ఈ గ్యాంగ్ అతడిపై దాడి చేసింది. పోలీసుల వేషంలో ముఠా సభ్యులు బాధితుడిని బెదిరించారు. ఈ కేసును కర్నూలు పోలీసులు విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఆ క్రమంలోనే వారు కావలిలోని ప్రధాన నిందితుడి ఇంట్లో సోదాలు చేశారు. పోలీసు శాఖ వద్ద ఉండాల్సిన ఆయుధాలు ఆ ఇంట్లో ఉండటం చూసి వారు నివ్వెరపోయారు. అలానే ఇటీవల కావలిలోనే మరో వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు, నెల్లూరలో మరో రూ. 60 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. గతేడాది ముత్తుకూరు జెన్కో రోడ్డులో జరిగిన రూ.40 లక్షల ట్రాప్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇటీవల ఓ డాక్టర్ రూ. 14.50 లక్షలు ఈ ట్రాప్ గ్యాంగ్ చేతిలో పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ ఈ వ్యవహారాలన్నీ బయటకొస్తున్నాయి. అయితే ఫిర్యాదులు అందని ట్రాప్‌లు చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులెవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయబోతే.. ఈ గ్యాంగ్ సభ్యులు పోలీసుల వేషంతో వచ్చి బెదిరిస్తారు. తర్వాత ఓ లాయర్ రంగంలోకి వచ్చి లొంగదీయడానికి చూస్తారు. కుదరని పక్షంలో దోచుకున్న దానిలో ఎంతో కొంత ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకోవడానికి చూస్తారు. వీటిని తప్పించుకున్న బాధితులే పోలీసులను ఆశ్రయిస్తున్నారని తెలుస్తోంది.


● ఎన్నో కేసులు.. అయినా లెక్కలేదు!

తక్కువ ధరకు బంగారం పేరుతోనే కాకుండా నకిలీ కరెన్సీ, రైస్ పుల్లింగ్ వంటి పలు రకాల మోసాలతో కూడా ఈ ట్రాప్ గ్యాంగ్స్ చెలరేగిపోతున్నాయి. ఈ గ్యాంగ్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా వందల కేసులున్నట్లు తెలుస్తోంది. అయినా వీరికి లెక్కలేదు. ఈ గ్యాంగ్ సభ్యులకు కొందరు పోలీసులే అండగా ఉంటున్నారన్న ప్రచారముంది. రెండేళ్ల క్రితం కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టిన కేసు విచారణ సందర్భంగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ సమయంలో ఈ గ్యాంగ్స్ చేతిలో మోసపోయిన అనేక మంది జిల్లాకు వచ్చి పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు. కానీ ఆ తర్వాత ఆ ఫిర్యాదులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఇటీవల రౌడీయిజం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో ఇప్పుడు నెల్లూరు ప్రశాంతంగా మారింది. ఆ విధంగానే ఈ ట్రాప్ గ్యాంగ్స్ విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇంకా అనేక మంది సామాన్యులు నిలువుదోపిడీకి గురవడం ఖాయమని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పైసలిస్తేనే..
ఫైలు ముందుకు!

- లేదంటే రోజుల తరబడి కాలయాపన
- ఆపై ఫోన్లు చేసి వేధింపులు
- విద్యా శాఖలో వసూల్‌రాజా
- పేరుకే కాంట్రాక్టు ఉద్యోగి.. చేసేవన్నీ పైరవీలే!
- అధికారుల వత్తాసుపైనా విమర్శలు

డీఈవో కార్యాలయంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి(అటెండర్)కి పగ్గాలు అప్పగించారు. ఏ ఫైలు ముందుకు వెళ్లాలన్నా తొలుత ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలి. ఆయనకు పైసలిస్తేనే ఫైలు కదులుతుంది. లేదంటే ఎన్ని నెలలైనా సరే సదరు ఫైలు ముందుకు కదలదని పలువురు బాధితులు తెలిపారు. ఒకవేళ ఆయన్ను ప్రసన్నం చేసుకోవడం ఆలస్యమైతే చాలు... నిత్యం పది, పదిహేనుసార్లు ఫోన్లు చేసి తమను ఇబ్బందులు పెడుతున్నాడని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కార్యాలయంలో తనకు ఉన్నతాధికారుల అండ ఉందని, ఏపని కావాలన్నా తాను మాత్రమే చేయగలనని ఆ అటెండర్ బహిరంగంగా చెబుతున్నాడు. కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నారు.



● ఫైలు కదలాంటే...

ఆ అటెండరుకి నగదు చెల్లించుకుంటే నెలలు, ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిందేనని బాధితులు చెబుతున్నారు. ఎంతోమంది టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగులు కార్యాలయ ఖజానాకు జమకట్టకుంటే ఇక ఎవరి పని కాదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ మెడికల్ రీఎంబర్స్‌మెంట్ అనుమతులకు, ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్స్ చేయించుకునేందుకు పలువురు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎంతోకొంత నగదు ఇస్తామన్నా, వినకుండా తాను చెప్పినంత ఇస్తేనే పని చేసి పెడతామని ఆ అటెండర్ ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నాడు.

● అసలేం జరుగుతుంది...?

అసలు విద్యాశాఖలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. డీఎస్ఏ, ఎస్‌జీఎఫ్ పోస్టుల్లో రహస్యంగానే నియామకాలు చేపట్టి, మీడియాకు కూడా సమాచారం లేకుండా ఉత్తర్వులు జారీ చేశారు. నెల తర్వాత దీన్ని బయటపెట్టి, తమదేమి లేదని రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నట్లు అధికారులు చెబుతుండటం విశేషం. ఇటీవల అవినీతి ఆరోపణలు అధికమవడంతో అనుభవం ఉన్న సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీలు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం విద్యాశాఖ కార్యాలయంలో కీలకమైన సీట్లన్నీ ఖాళీగా ఉండగా, ఉన్నసిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. దీంతో సందట్లో సడేమియాగా అన్నట్లు ఈ అక్రమ వసూళ్ల పర్వ నిరంతరాయంగా కొనసాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఆయనో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన చిరుద్యోగి. అయితేనేం.. అధికారులను కలవాలన్నా, ఫైలు ముందుకు కదలాలన్నా ఆయన్ను ప్రసన్నం చేసుకోవాల్సిందే. కాదు.. కూడదంటే ఇక ఆ ఫైల్ మూలకు చేరిపోతుంది. లేదా సదరు ఉద్యోగి ఫోన్లు చేసి మరీ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారుల అండ కూడా ఉండటంతో ఆయనకు బాగా కలిసి వస్తోంది.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

గర్భిణులు, చిన్నారులకు ఉన్నచోటే పోషకాహారం 8

శబరి.. ఇకపై సూపర్ ఫాస్ట్!

నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు

హైదరాబాదు నుంచి త్రివేండ్రంకు 2గంటల ప్రయాణ సమయం ఆదా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. నిన్న, మొన్నటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20గంటలకు బయల్దేరే శబరి ఎక్స్‌ప్రెస్ మరుసటి సాయంత్రం 6.05గంటలకు త్రివేండ్రంకు (29.45గంటల ప్రయాణం) చేరుకునేది. తాజాగా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయం త్రం 6.25గంటలకు (28గంటల్లో) చేరనుంది. అలాగే, ఇంతకుమునుపు త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45గంటలకు సికింద్రాబాద్‌కు (30గంటల్లో) వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌గా మారాక త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఉదయం 11గంటల కల్లా(27.45గంటల్లోగా) చేరనుంది.



ప్రయాణికులపై 'సూపర్ ఫాస్ట్' బాదుడు.!

శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణ సమయం 2గంటలు ఆదా అవుతుందని ఒకవైపు ఆనందపడుతున్న ప్రయాణికులు, మరోవైపు సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతుల టికెట్లపై రూ.30నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో ఉండే శబరి ఎక్స్‌ప్రెస్ నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యతలను నేటినుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

'గాంధీ విగ్రహావిష్కరణ' స్ఫూర్తిదాయకం

పొదలకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగిందని, విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని పొదలకూరు ఆర్యవైశ్య సంఘం నేతలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గుర్రం మీరామధు, ఆకులూరి విజయకుమార్, పొట్టి సుధాకర్, రాచపూటి ధనుంజయరావు, రాజా సురేంద్ర విలేకరులతో మాట్లాడారు. విగ్రహ దాత లయన్స్ క్లబ్, ఆకులూరు మధుకు అభినందనలు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11055
వెండి కిలో ధర	రూ. 148200
వెండి ఒక గ్రాము	రూ. 151.20

పొదలకూరు చెరువు.. స్వచ్ఛత కరువు!

- కట్టపై వ్యర్థాలు.. కళేబరాలు
- డంపింగ్ యార్డులా మారిన దైన్యం
- ఆక్రమణలతో కనుమరుగు?

పొదలకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాలకు సాగునీరు అందించడంతో పాటు ప్రజల అవసరాలు తీర్చే పొదలకూరు చెరువు అధ్వానంగా మారింది. వ్యర్థ పదార్థాలతో నిండిపోయి డంపింగ్ యార్డులా మారింది. ఇప్పటికే చెరువు ఓవైపు ఆక్రమణలకు గురైంది. వీటిని తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. చెరువు అభివృద్ధి విషయంలో అధికారులు చాలాకాలంగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో వ్యర్థాలు పేరుకుపోయి స్వచ్ఛత కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు, ఆయకట్టు రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువు చుట్టూ పరిశుభ్రత చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


వ్యర్థాలతో నిండిపోయిన పొదలకూరు చెరువు



వ్యర్థాలను తొలగించాలి

చెరువు గట్టుపై విపరీతంగా వ్యర్థాలు వేస్తున్నారు. వాడేసిన టెంకాయలు, మాంసం వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తుండడంతో చిట్టేపల్లికి వెళ్లే గ్రామస్తులు, ప్రజలు కట్టమీద వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. కళేబరాలను గట్టుపైన పడేయకుండా చర్యలు చేపట్టాలి.

\- ఎస్ వెంకటేష్, పొదలకూరు

చెరువును అభివృద్ధి చేయాలి



పొదలకూరు చెరువు గట్టను నడక మార్గాలుగా అభివృద్ధి చేయాలి. చెరువులో రోజురోజుకూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. జంగిల్ క్లియరెన్స్ చేపట్టి, హద్దులు వేసి ఆక్రమణలను అరికట్టాలి. ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేపట్టి ప్రజల అవసరాలు తీర్చే నీటి వనరుగా మార్చాలి.

\- మస్తాన్‌రెడ్డి, పొదలకూరు

'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్'తో ఆరోగ్య రక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

పొదలకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' ఆరోగ్య శిబిరాలతో మహిళలకు మరింత ఆరోగ్య రక్షణ కలుగుతుందని పొదలకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు పేర్కొన్నారు. సోమవారం సీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు అధిక రక్తపోటు, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్‌తోపాటు రక్తహీనత, క్షయ మొదలైన వాటికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ, కూటమి నాయకులు ప్రశాంత్, రాచపూటి ధనుంజయ రావు, ఓబులేసు, అనిల్‌కుమార్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు దసరా బోనస్ పంపిణీ


దసరా బోనస్ అందిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

మనుబోలు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రతిఏటా ఆనవాయితీగా పాడిరైతులకు విజయడెయిరీ పాలసేకరణ కేంద్రం ద్వారా దసరాబోనస్ ఇస్తామని సొసైటీ ప్రెసిడెంట్ పచ్చిపాల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పచ్చిపాల మాట్లాడుతూ సోమవారం 70 మంది పాడిరైతులకు 2024-25 సంవత్సరానికి గాను రూ. 1.75లక్షలను అందజేశామన్నారు. ఒక్క ఏడాదిలో రూ.కోటి విలువ చేసే పాలను ఇక్కడి రైతులు డెయిరీకి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు మారంరెడ్డి రమణారెడ్డి, దువ్వూరు వెంకటరమణారెడ్డి, సమాధి నాగయ్య, షైలాం సుధాకర్ రెడ్డి, సొసైటీ సెక్రటరి పోలంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

వెంకటాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డీ హరి కరుణాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం పుట్టికి రూ.20,306, సాధారణ రకాలకు పుట్టికి రూ.20,136 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులకు ధాన్యం డబ్బు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులేవీ..

కోవూరు, సెప్టెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు కౌలురైతులకు గుర్తింపు కార్డులిస్తామని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణమండపంలో సోమవారం జరిగిన కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో కౌలు రైతులకు కొత్తచట్టం తీసుకువస్తానని హామీ యిచ్చి ముఖం చాటేశారన్నారు. కౌలురైతుల కష్టాల్ని ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ రైతులందరికీ సమయానికి యూరియా అందించాలన్నారు. మహాసభలో రైతు సంఘ నాయకుడు చంద్ర రాజగోపాల్, సీఐటీయూ నాయకుడు ప్రసాద్, మహిళాసంఘం నాయకురాలు రెహానాబేగం తదితరులు మాట్లాడారు. మహాసభ నూతన కమిటీకి అధ్యక్షునిగా ముత్యాల గురునాథం, కార్యదర్శిగా తుళ్ళూరు గోపాల్ 27 మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా

వింజమూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. అందులో భాగంగా వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించారు. ప్రజల వద్ద నుండి నేరుగా అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధించిన అధి కారులను వెంటనే సంప్రదించి, త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకులు సాని వెంకటరమణయ్య, సర్వేపల్లి నియోజవర్గ తెలుగుయువత అధ్యక్షుడు శివుడు రాజాగౌడ్ ఆధ్వర్యంలో మనుబోలు నుంచి 30 కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరులోని తన పార్టీ కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, మైనార్టీ నాయకులు అమీర్ బాషా, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వల్లెపు మునుస్వామి ప్రమాణ స్వీకారం


మునుస్వామిని సత్కరిస్తున్న చైర్మన్లు ఈశ్వర్, వెంకటగురుమూర్తి

వెంకటాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత వల్లెపు మునుస్వామి సోమవారం ఏపీ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని గొల్లపూడి వద్ద ఉన్న బీసీ సంక్షేమ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వర్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మునుస్వామిని శాలువా, జ్ఞాపికతో వారు సత్కరించారు. మునుస్వామి మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సీఎం చంద్రబాబు బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు


పత్రాలను చూపిస్తున్న ఎంపీడీవో భవానీ, సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ షరీనాబేగం

రాపూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాపూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్‌వోలకు మండల పరిషత్ అధికారిణి మారెళ్ల భవానీ, జిల్లా సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ షరీనాబేగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ రాయితీపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రచురించిన పత్రాలను చూపించి వివరించారు. సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జరీనా బేగం మాట్లాడుతూ ఈనెల 22 నుంచి జీఎస్టీ అమలుతో సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించిందని ఈ సూపర్ జీఎస్టీ రాయితీపై ప్రతి గడపలో ప్రతి మహిళకు అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని తెలిపారు. జీఎస్టీలో రాయితీతో తగ్గిన నిత్యావసర వస్తువులు ధరలను సభ్యులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, ఏపీ దసరధరామిరెడ్డి, ఈఓఆర్డీ బాలకష్ణయ్య, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

రుణాల్లో బెస్ట్.. రికవరీల్లో వరస్ట్!


సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య

మనుబోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వడంలో ఉన్నంత శ్రద్ధ వాటిని రికవరీలు చేయడంలో లేదని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య మండిపడ్డారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీవోఏలతో మాట్లాడుతూ స్త్రీనిధి పథకం కింద డ్వాక్రా మహిళలకు 5 రకాల రుణాలు అందిస్తున్నామన్నారు. ఏడాదిలో రుణాలు ఇవ్వడంలో మనుబోలు మండలం 99 శాతం ఉంటే, ఆ రుణాలను రికవరీ చేయడంలో 18 శాతం ఉందన్నారు. మండలంలో రెండు సంఘాలు స్త్రీనిధి రుణాలు బకాయిలు పడడంతో రెండేళ్ళుగా మండలంలో డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణాలు ఆపేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వనజాక్షి, సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి అలంకరణలో కామాక్షితాయి అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కామాక్షితాయి సోమవారం 'శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో కామాక్షితాయి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామి, అమ్మ వార్లకు అభిషేకం, నవావరణ పూజలు చేశారు. రాత్రి స్వామికి అభిషేకం, అమ్మవారికి కాళరాత్రి నవావరణ పూజలు చేసి కొలువులు నిర్వహించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కామాక్షితాయిని సరస్వతీదేవిగా కొలువుదీర్చి బాలబాలికలతో భక్తి శ్రద్ధలనడుమ అర్చకస్వాములు సరస్వతీ పూజ నిర్వహించారు. బాలబాలికలకు పలకలు, బల పాలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంగళవారం కామాక్షితాయి శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పెద్దూరులో కొలువైన సీతా, లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి, ఆలయంలో కోదండ రాముడు శ్రీ సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామకృష్ణానగర్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ వేంకటేశ్వరుడు విద్యాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు.



మనుబోలు : సరస్వతీదేవిగా దుర్గాదేవి, రాపూరు : పాలభిషేకం చేస్తున్న విజయేశ్వరీ దేవి

రాపూరు : పెంచలకోనలోని శ్రీమాతృ దేవి విశ్వశాంతి ఆశ్రమంలో దేవీ నవ రాత్రులు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నిత్య అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం వేద పారాయణం, మహారుద్రా భిషేకం, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, మంగళ హారతులు జరిపి అనంతరం నవరాత్రి హోమాలు చేశారు. మధ్యాహ్నం శ్రీవిజయేశ్వరిదేవి ఆధ్వర్యంలో సరస్వతి సూక్త హోమం, మేధా సూక్త హోమం, సుదర్శన హోమం, ధన్వంతి హోమాలు వైభవంగా భక్తుల మధ్యన నిర్వహించారు. సాయంత్రం అమ్మ వారు హంస వాహనంపై సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులకు ఉచిత అన్నప్రసాదం, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఆదిలక్ష్మీ విద్యాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్నపనం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి నందనవనంలో విద్యాలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మంగళవారం అమ్మ వారు రాజ్యలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మనుబోలు: సోమవారం దుర్గా దేవిని మనుబోలు, కోదండరామపురంలో సర్వస్వతీ దేవిగా అలంకరించారు. అమ్మ వారికి అర్చకులు వేదమంత్రాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు, పిల్ల లు సరస్వతీదేవిని దర్శించుకుని నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

మొండి బకాయిలపై దృష్టి సారించండి

సొసైటీ చైర్మన్ గడ్డం వెంకటసామయ్య

ఉదయగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలపల్లి సహకార సొసైటీ ద్వారా రుణాలు పొంది సక్రమంగా చెల్లించని మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టిసారించి నూరు శాతం రికవరీ సాధించాలని సొసైటీ చైర్మన్ గడ్డం వెంకటసామయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన సర్వజన మహా సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసు కున్న రైతులు సకాలంలో చెల్లిస్తే మరొకరికి రుణం సౌకర్యం కలగడంతో పాటు సొసైటీ అభివృద్ధి చెందుతుందన్నారు. సొసైటీ పరిధిలో ఉన్న మొండి బకాయిదారులు త్వరితగతిన రుణ బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాల న్నారు. ఈకార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, సొసైటీ డైరెక్టర్లు నల్లిపోగు రాజా, బొజ్జా నరసింహారావు, సీఈవో రేకలగుంట పోలయ్య, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రూ. 2.36 కోట్ల రుణాల మంజూరు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం లోక్ కల్యాణ మేళా అట్టహాసంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, కమిషన్ గంగాప్రసాద్ మాట్లా డుతూ 2210 మంది వీధి వ్యాపారులకు రూ. 2.36 కోట్ల రుణాలు ఇచ్చారన్నారు. మొదటి విడత రూ. 10వేలు నుంచి 15వేల వరకు రుణాన్ని పెంచడం జరిగింది. రెండవ విడత రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి రూ. 50 వేల రుణ సదుపాయం కల్పించారు. వీధి విక్రయదారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు.

C.R.I.M.E N.E.W.S

రెండు కార్ల ఢీ : తప్పిన ప్రమాదం


విచారిస్తున్న పోలీసులు

సంగం, సెప్టెంబరు 29: మండల పరిధిలోని సంగం కొండ సమీపంలో ముంబాయి జాతీయ రహదారి కూడలిలో సోమవారం రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న కారు కొండ దిగే ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్ల వద్ద బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొని కొంతదూరం ముందుకు నెట్టుకుపోయింది. అయితే కారులో ప్రయాణం చేస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

నెల్లూరురూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై ఎక్స్ వేదికగా అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన అంజత్‌ఖాన్ ఇలాంటి పోస్టుల పెట్టిన కేసుల్లో ఇప్పటికే జైల్లో ఉన్నాడు. ఇతనిపై నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన జనసైనికుడు సీదార్ల నాగేంద్రబాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడిని పీటీ వారెంట్‌పై బయటకు తీసుకువచ్చి తాజాగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాడుతున్న గుర్తుతెలియని వృద్ధుడుని ప్రమాదవశాత్తు గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సౌత్‌రైల్వే స్టేషన్ వద్ద సోమవారం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించిన సుమారు 75 నుంచి 80 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్ఐ ఎస్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇళ్లమధ్యలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిర్వాహకులు పరారీలో ఉండగా విటుడును పోలీసులు అరెస్ట్ చేసి, ఇద్దరు సెక్స్ వర్కర్లును హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కళ్యాణి, మురళిలు పోస్టల్ కాలనీ మూడోవీధిలోని ఓ ఇంటిని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బదితో కలిసి వ్యభిచార కేంద్రంపై దాడి చేశారు. పొదలకూరు మండలంకు చెందిన విటుడు మహేష్‌ను అరెస్ట్ చేసి ఇద్దరు సెక్స్ వర్కర్లును అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన వృద్ధురాలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. పుష్పమ్మ(65) ఆత్మకూరు బస్టాండు పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుని జీవనం సాగించేది. రాత్రి వేళల్లో ఫ్లైవోవర్ బిడ్జి కింద, సమీపంలోని దుకాణాల వద్ద నిద్రించేది. ఈనెల 27వ తేదీన ఆత్మకూరు బస్టాండు ఫ్లవర్ మార్కెట్ సమీపంలో మినీబైపాస్ వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఆమెను వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు 45వ వార్డు వీఆర్‌వో చందన సోమవారం నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణ తెలిపారు.

యువతి మెడలో గొలుసు చోరీ

మనుబోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న యువతి మెడలోంచి ఇద్దరు ఆగంతకులు గొలుసు లాక్కెళ్ళిన సంఘటన మనుబోలులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు స్థానిక కోదండరామాపురానికి చెందిన మల్లి విజయ కొద్ది నెలలుగా స్థానిక ఓ సూపర్‌మార్కెట్‌లో పని చేస్తోంది. డ్యూటీ ముగించుకుని దుకాణం నుంచి ఇంటికి వెళుతుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై యువతికి ఎదురొచ్చారు. యువతిదగ్గరకు రాగానే మోటార్ సైకిల్ వెనుకున్న యువకుడు హఠాత్తుగా విజయ మెడలోంచి చైన్ తెంపుకొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. వెంటనే విజయ కేకలు వేయడంతో స్థానికులు యువకులను పట్టుకునే ప్రయత్నం చేసినా వారు పరారయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 2 సవర్ల బంగారు గొలుసు రూ. 2 లక్షల ఖరీదు ఉంటుందని యువతి విలపించింది.

అందని వైద్య సేవలు... ఎంఎల్‌హెచ్‌పీనే దిక్కు!


విధులు నిర్వర్తిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సమ్మె కారణంగా మండల కేంద్రమైన వరికుంటపాడులోని వైద్యశాలకు ఎంఎల్ హెచ్ పీనే దిక్కుగా మారింది. సోమవారం కేవలం ఎల్‌టీ, ఫార్మాసిస్టు మాత్రమే విధులకు హాజరయ్యారు. వైద్యశాల పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు బదులుగా పెద్దిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో విధులు నిర్వర్తించే ఎంఎల్ హెచ్‌పీకి విధులు అప్పగించి చేతులు దులుపుకున్నారు. దీంతో గ్రామం లోని క్లినిక్ తలుపులు తీసే నాధులే కరువయ్యారు. ఈనేపధ్యంలో వైద్యం కోసం అక్కడికి పరుగులు తీసిన రోగులు చేసేదేమిలేక మౌనంగానే వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యశాలలోను నాడీ పట్టే పరిస్థితులు లేకపోవడంతో సిబ్బంది అందించే అరకొర మందులతోనే కాలం వెల్లబుచ్చాల్సి వచ్చిందని పలువురు వాపోతున్నారు.


చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	246

కోడిగుడ్ల ధర (100): 550


నవాబుపేటలో సరస్వతీదేవిగా ద్రౌపదీదేవి


సరస్వతీదేవిగా కోదండరామపురం మహాలక్ష్మి


అయ్యప్పగుడిలో సరస్వతీదేవిగా ఆదిలక్ష్మి

సరస్వతీ నమస్తుతే..!

● సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం 8వ రోజుకి చేరాయి. పలు ఆలయాల్లో అమ్మణ్ణులు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. నగర నాయకి రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యతో తరలివచ్చారు. ఉదయం నవావరణ పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంలు, సంపుటీకరణ, చండీ హోమాలు, విశేష పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం పూలం గిసేవ సేవలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సరస్వతీదేవి అలంకారంలో రాజరాజేశ్వరి భక్తులకు దర్శన మిచ్చారు.

● స్టోన్‌హౌస్‌పేటలో వెలిసి ఉన్న కన్యకా పరమేశ్వరికి సరస్వతీదేవి అలంకారం వైభవంగా జరిగింది. అమ్మవారికి విశేష నవావరణ పూజలు, లలితా సహస్ర నామ పారాయణం, సహస్ర దీపాల అలంకరణలు అల రించాయి. మూలవరుకు పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలతో సరస్వతీ అలంకారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి బారులుతీరారు. కాగా సోమవారం రాత్రి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలక మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరీ భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకారం, పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. మహాన్యాస పూర్వక రుద్రా భిషేకాలు, నవావరణ పూజలు జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

● నగర గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరికి చండీ అలంకారం వైభవంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, పుష్పాలంకారం, రాత్రి సామూహిక కుంకుమ పూజలు, పల్లకీ ఉత్సవం జరిగాయి. ఈ కార్యక్ర మాలను ఆలయ పాలక మండలి అధ్యక్షుడు ఒట్టూరు సురేంద్రయాదవ్, ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి సరస్వతీ అలంకారం, పూజలు జరిగాయి. విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలను ఈవో యు.జానకమ్మ, సిబ్బంది పర్యవేక్షించారు.

● పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబకు దేవీ నవరాత్రి పూజలు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివస్తు న్నారు. అమ్మవారికి సరస్వతీ అలంకారం, పూ జలు, అభిషేకాలు, విశేష పూలంగిసేవలు జరి గాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి.

● కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో సరస్వతీ అలంకారం, సామూహిక కుంకుమ పూజలు, విశేష పూలంగి సేవలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ పత్తి నరసింహం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజుస్వామి ఆలయంలో ద్రౌపదీదేవి భక్తులకు సరస్వతీ అలంకారంలో దర్శనం ఇచ్చారు. భక్తులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి నాగేంద్ర, మాజీ చైర్మన్ సాదా నాగేంద్రకుమార్, అర్చకులు జీ.రామసుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షించారు.

● బాలాజీనగర్ సీతారామమందిరంలో సీతాదేవికి మహాసరస్వతీ అలంకారం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, సాయంత్రం కుం కుమపూజ జరిగాయి. ఈ కార్యక్రమాలను సీతారామమందిరం కమిటీ వాకాటి నరసయ్య, త్యాగరాజ కల్యాణ మండపం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● పప్పులవీధి మహాలక్ష్మి సరస్వతీగా దర్శనం ఇచ్చారు. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. విశేష పూలంగిసేవ, ఊంజల్‌సేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను పప్పులవీధి మిత్రమండలి, మహాలక్ష్మి మహిళా మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● సిద్ధి విఘ్నేశ్వరాలయంలో అమ్మవారికి సరస్వతీ అలంకారం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం మహాన్యాసం నిత్యపూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


కన్యకా పరమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ఆదిలక్ష్మికి సరస్వతీ అలంకారం వైభవంగా జరిగింది. దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● రంగనాయకులపేట వేదాంత దేశీకర్ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో చంద్రప్రభ అలంకారం పేట ఉత్సవం వైభవంగా జరిగింది. విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. దేవస్థానం కమిటీ పర్యవేక్షించింది.

● రాజరాజేశ్వరికి

నేడు మంత్రి ఆనం సారె సమర్పణ

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి రాజరాజేశ్వ రికి సారె సమర్పిస్తారని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు. అలాగే మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని మంత్రి దర్శించుకుంటారని ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు. అదేవిధంగా మంగళవారం రాత్రి కన్యకాపరమేశ్వరిని మంత్రి ఆనం దర్శించుకుంటారని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు.షణ్ముఖ రావు, కమిటీ సభ్యులు తెలిపారు.

● నగరంలోని హరనాథపురంలో సంస్కృతి సంప్రదాయాల మేరకు శ్రీలక్ష్మి, రాజాదం పతులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. హిందూ సమాజ ఆచారాలు, అలవాట్లు ఉట్టిప డేలా బొమ్మలను తీర్చిదిద్దారు. వారిని బాల భవన్ ఇన్‌చార్జి సుభద్రాదేవి తదితరలు అభి నందించారు.

● వేదగిరిలో సరస్వతీదేవీగా..

నెల్లూరురూరల్ : వేదగిరి క్షేత్రంలో దసరా ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నా యి. సోమవారం ఆదిలక్ష్మీదేవీ భక్తులకు సరస్వతీదేవీగా దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చ క బృందం అలంకరించిన అమ్మవారిని ప్రత్యేక మందిరంలో భక్తు ల దర్శనార్థం ఉంచారు.

ఆహారపు అలవాట్లపై అవగాహన


పోషకాహారం ప్రదర్శిస్తున్న వైద్యులు, అధికారులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోడిగాడితోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ఐసీడీఎస్ ప్రాజెక్టు నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ మాట్లాడుతూ స్థూలకాయ నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ప్రోత్సహించటం వల్ల వాల్య రక్షణ, పోషణ, పిల్లల శారీరక మానసిక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. చిన్నపిల్లలకు తల్లిపాలతో పాటు సుస్థిర ఆహారాన్ని అందించటం గురించి తెలియచేశారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్కవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పత్రికా ప్రకటన

నా క్లయింట్లు అయిన నెల్లూరు జిల్లా, నెల్లూరు సిటీ, ధనలక్ష్మీపురం, సాయిక్రిష్ణ నగర్ కాపురస్తులు అయిన **1.గుంటుపల్లి రాంబాబుగారి భార్య అంజనీకుమారి, 2.గుంటుపల్లి రాంబాబు** గారి కుమారుడు కార్తీక్ గార్ల వలన సమాచారము పొందిన మీదట ఈ క్రింది విధముగా తెలియజేయ డమైనది. నా క్లయింట్లు తల్లి కొడుకు అయివున్నారన్నీ, నా క్లయింట్లు వారి వ్యాపార అవసరముల నిమిత్తం నెల్లూరు సిటీ కాపురస్తుడైన **గడ్డం ప్రసాద్, తండ్రి: పేరయ్య** మరియు అతని అనుచరులు **బొడ్డు హజరత్** మరియు అతనికి సంబంధించిన బి.సి.ఆర్.ఫిల్లింగ్ స్టేషన్, ఎస్.వి.ఆర్. ఫిల్లింగ్ స్టేషన్ల నుండి మరియు **సుప్రజా, ఫణీంద్ర, రాజేంద్రరెడ్డి** గార్ల వద్ద **రూ.3,86,55,000/- అక్షరాలు మూడు కోట్ల ఎనభై ఆరు లక్షల యాభై అయిదు వేల రూపాయలు** అప్పుగా వివిధ తేదీలలో నా క్లయింట్లు బ్యాంక్ ఎకౌంట్లకు ట్రాన్స్ఫర్ చేసిన దబ్బులను తీసుకొని వ్యాపారము నిర్వహిస్తూ సదరు అప్పుగా తీసుకున్న మొత్తమునకు గాను తిరిగి **రూ. 3,11,04,900/- అక్షరాల మూడు కోట్ల పదకొండు లక్షల నాలుగు వేల తొమ్మిది వందల రూపాయలు గడ్డం ప్రసాద్** మరియు అతని అనుచరులు అను వార్ల బ్యాంక్ ఎకౌంట్లకు వివిధ తేదీలలో చెల్లించియున్నప్పటికీ **గడ్డం ప్రసాద్** మరియు అతని అనుచరులు సంతృప్తి చెందక డి.08-05-2025న నా క్లయింట్లు ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి నా క్లయింట్లను మరియు **గుంటుపల్లి అంజనీకుమారి గారి భర్త రాంబాబు** అనువార్లను బెదిరించి బలవంతంగా నా క్లయింట్లు **1. అంజని కుమారి దగ్గర హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ ఎకౌంట్ నెం. 50100627461182 తాలూకు చెక్ నెం. 000014 ఖాళీ చెక్కు మరియు ఒక ఖాళీ ప్రామిసరీ నోటు, 2. గుంటుపల్లి కార్తీక్**కు చెందిన హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు చెందిన **ఖాళీ చెక్ నెం. 000034 నుండి 000036, 000021 మరియు ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ ఎకౌంట్ నెం. 631001545165 తాలూకు ఖాళీ చెక్ నెం. 000660, 000661** అనే రెండు ఖాళీ చెక్కులు మరియు నాలుగు ఖాళీ ప్రామిసరీ నోట్లు మరియు 100 రూపాయలు ఖాళీ స్టాంప్ పేపరుపై సంతకాలు చేయించుకున్నారు. నా క్లయింటు **గుంటుపల్లి అంజనీకుమారి** భర్త **రాంబాబు**కు చెందిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎకౌంట్ నెం. 049810023002892** నుండి రెండు ఖాళీ చెక్కులు, రెండు ఖాళీ ప్రామిసరీ నోట్లు మరియు నా క్లయింటు వియ్యంకుడైన **జి.వి.శేషయ్య** గారి **ప్రాపర్టీ డాక్యుమెంట్ నెం. 3800/2016** ఒరిజినల్ డాక్యుమెంట్ దౌర్జన్యంగా తీసుకొని వెళ్ళినది కాకుండా **డి. 15-07-2025**న నా క్లయింటు యొక్క **భర్త అయిన గుంటుపల్లి రాంబాబు**ను బెదిరించి 200 చదరపు గజముల ఖాళీ స్థలము, అందులోని 1656 చదరపు అడుగులు గల ఆర్.సి.సి. డాబా ఇల్లును **గడ్డం ప్రసాద్** గారి కుమారుడు **గడ్డం అవినాష్** పేరిటకు సుమారు మూడు కోట్ల రూపాయలు విలువైన ఆస్తిని బలవంతంగా ఇంకా బాకీ రావాలని ఇది రిజిష్టరు చేస్తే నా క్లయింటుకు సంబంధించిన ఖాళీ చెక్కులు, ఖాళీ ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు తిరిగి ఇచ్చి వేస్తామని నమ్మబలికి బలవంతంగా ఎటువంటి నగదు చెల్లించకుండా అక్రమ రిజిస్ట్రేషన్ సెక్యూరిటీగా రిజిష్టరు చేయించుకున్నారని, అటువంటి రిజిస్ట్రేషన్లు చెల్లనేరదని తెలియజేయడమైనది. ఈ విషయాలు ఎవ్వరికైన చెప్పినా, పోలీసు రిపోర్టు ఇచ్చినా నా క్లయింట్లను చంపుతామని బెదిరించిగా, నా క్లయింట్లు భయపడి లేటుగా నా క్లయింట్లు **డి. 26-05-2025**న రూరల్ పోలీసు వారికి కంప్లైయింట్ ఇచ్చినారు. పోలీసు వారు ఎటువంటి చర్యలు తీసుకొనలేదని నెల్లూరు జిల్లా ఎస్.పి. గారికి రిపోర్టు చేసియున్నారు.

కాబట్టి **గడ్డం ప్రసాద్** మరియు అతని అనుచరులు మీ చట్ట విరుద్ధమైన అక్రమ చర్యలను విరమించుకోవాలి. మా క్లయింట్లను బెదిరించి, నిర్బంధించి వారివద్ద పొందిన రిజిస్టర్ డాక్యుమెంట్లను మరియు మా క్లయింట్ల సంతకములు గల ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లను మా క్లయింట్లకు తిరిగి ఇవ్వకుండా మీకు చెందిన వ్యక్తుల ద్వారా దావాలు వగైరా దాఖలు చేసిన యెడల అట్టి కేసులు మా క్లయింట్లపై బైండుకావని, అవసర వ్యాజ్యములకు కారకులైన వారిపై మా క్లయింట్లు చట్టపరమైన చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు: **గంగూరి అజయ్‌కుమార్,** B.Com., LL.B.,
పిటిషనర్స్- వాది తరపు న్యాయవాది,
మెయిన్‌రోడ్డు, దేవి ఏజెన్సీ వెనుక,
సత్తెనపల్లి-522403, సెల్: 98855 41122

నెల్లూరు
తేది: 29-09-2025

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీసింహపురి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వై.మోహన్‌రాజు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సహించడంతో తమ పాఠశాలకు చెందిన భవ్యశ్రీ, చైత్రలు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల ఎంపికలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో కూడా ఉత్తమంగా రాణించి జిల్లాకు, పాఠశాలకు కీర్తి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, పీఈటీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత స్థలం ఉంటే

గృహ నిర్మాణానికి రూ.2.50 లక్షలు

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో సొంత స్థలాలుండే వారు గృహ నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం రూ2.50 లక్షల ఆర్థిక తోడ్పాటునిస్తుందని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 2.0లో భాగంగా సొంత స్థలాలుండే వారు గృహ నిర్మాణాలకు సిద్ధమైతే ఈ మేరకు ఆర్థిక ప్రోత్సాహం అందుతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ కాలనీల్లో నిర్మాణాలకు ప్రభుత్వం బీసీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.75 వేలు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆసక్తి కలిగిన లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. స్థల యజమానులు, లేఅవుట్ దారులు ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాటివీధి హోమియోపతి ఆసుపత్రి వద్ద ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌పార్మర్‌కు సోమవారం మెష్ ఫెన్సింగ్ నిర్మాణం చేశారు. తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు చొరవతో ఈ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం మాట్లాడుతూ ఈ ఫెన్సింగ్ నిర్మాణంతో ప్రజల భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ బోర్డు చర్యలు తీసుకోవటం ఆనందంగా ఉందన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ 47వ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్, నేతలు కలవకుంట భాస్కర్, సిద్ధ కళాచారి, నెల్లూరు నరసయ్య, శివాచారి, విద్యుత్‌శాఖ అధికారులు నస్రుల్లా, సురేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింట్లు అయిన నెల్లూరు జిల్లా, నెల్లూరు సిటీ, ధనలక్ష్మీపురం, సాయిక్రిష్ణ నగర్ కాపురస్తులు అయిన **1. గుంటుపల్లి రాంబాబుగారి భార్య అంజనీకుమారి, 2. గుంటుపల్లి రాంబాబు గారి కుమారుడు కార్తీక్** గార్ల వలన సమాచారము పొందిన మీదట ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది.

నా క్లయింట్లు తల్లి కొడుకు అయివున్నారనిన్నీ, నా క్లయింట్లు వారి వ్యాపార అవసరముల నిమిత్తం హైదరాబాద్ కాపురస్తుడైన **మన్నేపల్లి రమేష్ గారి** వద్ద **రూ.1,04,00,000/- అక్షరాల ఒక కోటి నాలుగు లక్షల రూపాయలు** అప్పుగా వివిధ తేదీలలో నా క్లయింట్లు బ్యాంక్ ఎకౌంట్కు ట్రాన్స్ఫర్ చేసిన దబ్బులను తీసుకొని వ్యాపారము నిర్వహిస్తూ సదరు అప్పుగా తీసుకున్న మొత్తమునకు గాను తిరిగి **రూ.1,29,52,100/- అక్షరాల ఒక కోటి ఇరవై తొమ్మిది లక్షల యాభై రెండు వేల వంద రూపాయలు మన్నేపల్లి రమేష్ మరియు అతని భార్య గౌతమి** గార్ల బ్యాంక్ ఎకౌంట్లకు వివిధ తేదీలలో చెల్లించియున్నప్పటికీ **మన్నేపల్లి రమేష్** సంతృప్తి చెందక నెల్లూరు సిటీ బాలాజీనగర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసు స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న **మన్నేపల్లి రమేష్** మామ అయిన **సిహెచ్. శివకుమార్** సహాయంతో అధికమొత్తంలో వడ్డీ చెల్లించమని నా క్లయింట్లను డిమాండ్ చేయగా అందుకు మా క్లయింట్లు అంగీకరించనందున **డి.12.8.2025న మన్నేపల్లి రమేష్, శివకుమార్**తో పాటు మరో ఇద్దరు నా క్లయింట్ల ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి వారిని బెదిరించి బలవంతంగా పోలీసు స్టేషన్లో నిర్బంధించి చంపుతామని బెదిరించి సి.ఐ. సాంబశివరావుగారి సమక్షంలో మా క్లయింట్ల చేత **రూ. 65,00,000/-** చెల్లించగలమని ఒప్పుకున్నట్లు ఒప్పంద పత్రంపై సంతకములు చేయించుకున్నారనిన్నీ, వాటితో పాటు మా క్లయంట్లను బెదిరించి ఖాళీ ప్రామిసరీ నోట్లుపై,హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకుకు చెందిన **చెక్కు నెం.000026, 000027, 000028** అనే నెంబర్లు గల ఖాళీ చెక్కులపై సంతకాలు పెట్టించుకొని అట్టివాటి ఆధారంగా **మన్నేపల్లి రమేష్** అతని మామ హెడ్ కానిస్టేబుల్ **శివకుమార్** వారికి చెందిన వ్యక్తుల ద్వారా మా క్లయింట్లపై చెక్ బౌన్స్ కేసులు, ప్రామిసరి నోటు దావాలు వేయబోవుచున్నట్లు మా క్లయింట్లకు తెలియవచ్చినది. మరియు సదరు ఒప్పుదల పత్రము నా క్లయింట్లను భయభ్రాంతులకు గురిచేసి బలవంతముగా బాలాజీనగర్ పోలీసు స్టేషన్లో స్టేషన్ రైటర్ గారి ద్వారా తయారు చేయించిన ఒప్పుదల పత్రము చెల్లనేరదని తెలియజేయడమైనది.

కావున **మన్నేపల్లి రమేష్,** హెడ్ కానిస్టేబుల్ **శివకుమార్** ఇరువురు మీ చట్ట విరుద్ధమైన అక్రమ చర్యలను విరమించుకోవలసినదిగాను మా క్లయింట్లను బెదిరించి, నిర్బంధించి వారివద్ద పొందిన ఒప్పుదల పత్రము, మా క్లయింట్లు సంతకములు గల ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లను మా క్లయింట్లకు తిరిగి ఇవ్వకుండా మీకు చెందిన వ్యక్తుల ద్వారా దావాలు వగైరా దాఖలు చేసిన యెడల అట్టి కేసులు మా క్లయింట్లపైన బైండుకావని, అవసర వ్యాజ్యములకు కారకులైన వారిపై మా క్లయింట్లు చట్టపరమైన చర్యలు తీసుకొనగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు: **గంగూరి అజయ్‌కుమార్,** B.Com., LL.B.,
పిటిషనర్స్- వాది తరపు న్యాయవాది,
మెయిన్‌రోడ్డు, దేవి ఏజెన్సీ వెనుక,
సత్తెనపల్లి-522403, సెల్: 98855 41122

నెల్లూరు
తేది: 29-09-2025

పత్రికా ప్రకటన

నా క్లయింట్లు అయిన నెల్లూరు జిల్లా, నెల్లూరు సిటీ, ధనలక్ష్మీపురం, సాయికృష్ణనగర్ కాపురస్తులు అయిన **1.గుంటుపల్లి రాంబాబు గారి భార్య అంజనీకుమారి, 2. గుంటుపల్లి రాంబాబు గారి కుమారుడు కార్తీక్ గార్ల** వలన సమాచారము పొందిన మీదట ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది.

నా క్లయింట్లు తల్లి కొడుకు అయివున్నారనిన్నీ, నా క్లయింట్లు వారి వ్యాపార అవసరముల నిమిత్తం నెల్లూరు సిటీ కాపురస్తురాలైన **వడ్డి ప్రియాంక తండ్రి: వడ్డీ సురేంద్రనాయుడు** గారి వద్ద **రూ. 2,96,80,001/- అక్షరాల రెండు కోట్ల తొంభై ఆరు లక్షల ఎనభై వేల ఒక రూపాయలు** అప్పుగా వివిధ తేదీలలో నా క్లయింట్లు బ్యాంక్ ఎకౌంట్లకు ట్రాన్స్ఫర్ చేసిన దబ్బులను తీసుకొని వ్యాపారము నిర్వహిస్తూ సదరు అప్పుగా తీసుకున్న మొత్తం గాను తిరిగి **రూ.3,30,58,252/- అక్షరాలు మూడు కోట్ల ముప్పై లక్షల యాభై ఎనిమిది వేల రెండువందల యాభై రెండు రూపాయలు వడ్డీ ప్రియాంక** మరియు ఆమె తండ్రి **వడ్డీ సురేంద్రనాయుడు,** ఆమె అన్న **వడ్డీ కృష్ణకాంత్** మరియు ఆమె తల్లి వడ్డీ సామ్రాజ్యం అను వార్ల బ్యాంక్ అకౌంట్లకు వివిధ తేదీలలో చెల్లించియున్నప్పటికీ **వడ్డీ ప్రియాంక** మరియు ఆమె కుటుంబ సభ్యులు సంతృప్తి చెందక డి. **05-05-2025**న నా క్లయింట్లు ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి నా క్లయింట్లను మరియు గుంటుపల్లి అంజనీకుమారి గారి భర్త రాంబాబు అనువార్లను బెదిరించి బలవంతంగా నా క్లయింట్లు 1.అంజనీకుమారి దగ్గర హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ ఎకౌంట్ నెం. **50100627461182 తాలూకు చెక్ నెం. 000019 నుండి 000023** వరకు గల 5 ఖాళీ చెక్కులు మరియు మూడు ఖాళీ ప్రామిసరీ నోట్లు, 2. గుంటుపల్లి కార్తీక్కుకు చెందిన **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు ఎకౌంట్ నెం. 502008094 తాలూకు ఖాళీ చెక్ నెం. 000040 మరియు ఎస్.బి.ఐ. ఎకౌంట్ నెం.40830056381 తాలూకు ఖాళీ చెక్ నెం. 189268,189269** అనే రెండు ఖాళీ చెక్కులు మరియు మూడు ఖాళీ ప్రామిసరీ నోట్లు మరియు 100 రూపాయల ఖాళీ స్టాంప్ పేపర్ పై సంతకాలు చేయించుకున్నారు. నా క్లయింటు **గుంటుపల్లి అంజనీకుమారి భర్త రాంబాబు** వద్ద నుండి రెండు ఖాళీ ప్రామిసరీ నోట్లు మరియు నా క్లయింటు **కార్తీక్**కు సంబంధించిన ల్యాప్టాప్, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఆధార్ కార్డు & పాన్ కార్డులు దౌర్జన్యంగా తీసుకొని మరియు ఏపీ40ఏడి 9198 ఆర్.ఇ. క్లాసిక్ 350 బుల్లెట్ బండిని దౌర్జన్యంగా తీసుకొని వెళ్ళినది కాకుండా, డి. 11-08-2025న నా క్లయింటు అయిన **గుంటుపల్లి కార్తీక్**న్ను బెదిరించి నా క్లయింటుకు సంబంధించిన ప్లాట్ నెం. 88, 480 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని బలవంతంగా ఇంకా బాకీ రావాలని, ఇది రిజిష్టర్ చేస్తే నా క్లయింటుకు సంబంధించిన ఖాళీ చెక్కులు, ఖాళీ ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు మరియు స్వాధీనపు అగ్రిమెంట్లు **డి. 13-05-2025 & డి. 20-05-2025**న తిరిగి ఇచ్చి వేస్తామని నమ్మబలికి బలవంతంగా ఎటువంటి నగదు చెల్లించకుండా అక్రమ రిజిస్ట్రేషన్ సెక్యూరిటీగా రిజిష్టర్ చేయించుకున్నారని, అటువంటి రిజిస్ట్రేషన్ చెల్లనేరదని తెలియజేయడమైనది. ఇదిలావుండగా నా క్లయింట్లు డి. 26-05-2025న, నెల్లూరు జిల్లా ఎస్.పి. గారికి రిపోర్టు చేసియున్నారు. కాని పోలీసువారు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఆ దరిమిలా వడ్డీ ప్రియాంక నా క్లయింట్లు మరియు నా క్లయింట్లు కుమార్తె, అల్లుడులపై కూడా తప్పుడు సమాచారంతో పోలీసు వారికి వేదాయపాళెం పోలీసు స్టేషన్లో రిపోర్టు చేయగా సదరు పోలీసువారు ఎటువంటి విచారణ చేయకుండా నా క్లయింట్లు పై **డి.10-09-2025**న అబద్ధపు కేసు నమోదు చేసియున్నారు.

కావున **వడ్డీ ప్రియాంక** మరియు ఆమె కుటుంబ సభ్యులు మీ చట్ట విరుద్ధమైన అక్రమ చర్యలను విరమించుకోవలసినదిగా మా క్లయింట్లను బెదిరించి, నిర్బంధించి వారివద్ద పొందిన రిజిస్టార్ డాక్యుమెంట్లను మరియు స్వాధీనపు అగ్రిమెంట్లు మరియు మా క్లయింట్ల సంతకములుగల ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లను మా క్లయింట్లకు తిరిగి ఇవ్వకుండా మీకు చెందిన వ్యక్తుల ద్వారా దావాలు వగైరా దాఖలు చేసిన యెడల అట్టి కేసులు మా క్లయింట్లపై బైండుకావని, అవసర వ్యాజ్యములకు కారకులైన వారిపై మా క్లయింట్లు చట్టపరమైన చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది.

ఇట్లు: **గంగూరి అజయ్‌కుమార్,** B.Com., LL.B.,
పిటిషనర్స్- వాది తరపు న్యాయవాది,
మెయిన్‌రోడ్డు, దేవి ఏజెన్సీ వెనుక,
సత్తెనపల్లి-522403, సెల్: 98855 41122

నెల్లూరు
తేది: 29-09-2025

ఘనంగా వరల్డ్ హార్ట్ డే

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నారాయణ ఆసుపత్రిలో ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్‌కుమార్ గుండె వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ తిలక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆహారం, వ్యాయామం, ధ్యానం వంటివి అవలంబిస్తే గుండె జబ్బులు నివారించ వచ్చన్నారు. 7 గంటలు తగ్గకుండా నిద్రపోవాలని, ప్రతిరోజూ నడక, యోగా చేయాలని కోరారు. ప్రస్తుతం 20 ఏళ్లకు గుండె వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, కార్డియాలజీ బృందం తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఆధ్వర్యంలో 3 కే వాక్

నగరంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హృదయ వ్యాధుల దినోత్సవం సంద ర్భంగా 3 కే వాక్ నిర్వహించారు. గాంధీబొమ్మ కూడలి నుంచి కిమ్స్ ఆసుపత్రి వరకు ఈ 3కే వాక్ జరిగింది. వైద్యులు బెలూన్లు ఎగరేసి వాక్‌ను ప్రారంభించారు. వర్షంను సైతం లెక్కచేయకుండా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు, ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడారు. గుండె వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు, కార్డియోథోరాసిస్ సర్జన్ డాక్టర్ లో కేష్, జనరల్ సర్జన్ డాక్టర్ జగదీష్, తదిత రులు పాల్గొన్నారు.

వాస్కులర్, ఎండో వాస్కులర్ సేవల ప్రారంభం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహానగరాలకే పరిమితమైన వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జరీ సేవలు మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చాయని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో నూతన వాస్కులర్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో ఈ వాస్కులర్ సర్జరీ సేవలు చాలా అవసరమన్నారు. వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ షుగర్ రోగులకు కాళ్లలో మాని పుండ్లు, వేళ్ల నల్లబడటం వల్ల కాళ్లు, వేళ్ల తీసివేయకుండా రక్తప్రసరణ మెరుగు పడేందుకు అంజియోప్లాస్టీ, స్టంటింగ్ ఈ విభాగం ప్రత్యేకత అన్నారు. కిడ్నీ డయాలసిస్‌కు ప్రత్యేక పద్ధతులతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వాకముడి, డాక్టర్ చంద్రశేఖర్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శి రాహుల్ బాబు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.





పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు!

● ఆకట్టుకుంటున్న నల్లమల ఫారెస్ట్

చుట్టూ పచ్చని చెట్లు.. వాటి మధ్యలో ఎత్తయిన కొండలు.. నల్లని రోడ్డు.. ప్రకృతిప్రియులను ఇట్టే ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నల్లమల అడవిలో చెట్లన్నీ చిగురించాయి. దీంతో మొన్నటిదాకా వెలవెలబోయిన కొండలు ఇప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదం పంచుతున్నాయి. నెల్లూరు-కడప జిల్లా సరిహద్దులో మర్రిపాడు పోలీసులు నిర్వహిస్తున్న నిఘాలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ద్వారా తీసిన ఫొటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

ఈ నీరు తాగేదెలా!?

అనంతసాగరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అనంతసాగరంలో కుళాయిలకు రంగుమారిన నీరు సరఫరా అవుతున్నాయని, తాగేందుకు పనికిరావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో ఈసమస్య కొంతకాలంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. నీరు మురికిగా వస్తుండంతో వాడుకునేందుకు, తాగేందుకు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదంటూ వాపోతున్నారు. సమస్య ఎక్కడుందో గుర్తించి సురక్షిత నీరు సరఫరా అయ్యేలా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.సాగరంలో కుళాయిలకు వస్తున్న రంగుమారిన నీటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి వుంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఇప్పటికే గ్రామంలో జ్వరాలు ఉన్నాయి. ఇక కలుషిత నీరు వాడకం ద్వారా ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయోనన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వైద్యఆరోగ్య శాఖ ద్వారా ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రజలకు నీటి వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిల్వ ఉంచుకోవడంతో కలిగే అనర్థాలు, దోమల లార్వా వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కుళాయి నుంచి వస్తున్న రంగు మారిన నీరు



సరస్వతీ నమస్తుభ్యం!

● ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు
● సామూహిక విద్యాభ్యాసాలు
● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవార్లు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సరస్వతీ హోమాలు, పూజలు జరిగాయి. మరికొన్ని ఆలయాల్లో సామూహిక విద్యాభాస్యం జరిగింది. భారీ సంఖ్యలో తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొనగా, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి, కన్యకా పరమేశ్వరి, ఇరగాళమ్మ, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కామాక్షితాయి, కావలిలో కలుగోళమ్మ, రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారు, నెల్లూరు రూరల్ మండలం వేదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతోపాటు ప్రముఖ మహాలక్ష్మి ఆలయాల్లో సరస్వతీ అలంకరణలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



ప్రజా విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం),సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కి వచ్చే ప్రజా విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యల అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

● అర్జీదారులకు ప్రత్యేక సౌకర్యాలు

పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. అర్జీదారులు ఎక్కువ సంఖ్యలో రావటంతో క్లాత్ పందిళ్లను ఏర్పాటు చేయించారు. సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జేసీ ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● నిర్ధిష్ట ఫార్మాట్‌లో పంపండి

ప్రభుత్వ కార్యాకలాపాలకు సంబంధించి ఈ-ఆఫీసులో పంపుతున్న ఫైళ్లను నిర్ధిష్ట ఫార్మాట్‌లో పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక క్రమ సంఖ్యను కేటాయించి, ఆ నంబరు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

● పోస్టర్ ఆవిష్కరణ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజలందరికీ అందించాని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపుతో 90 శాతం వస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ జేసీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరురోడ్డు సెంటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలని కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధామాధవ్, కొణిదల సందీప్, కలువాయి మండల అధ్యక్షుడు మనో హరి తదితరులు కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

● రూ. 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

నెల్లూరు (వైద్యం) : సంగం మండలం పెరమన క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం కింద రూ. 10 లక్షలు చెల్లించాలని సీపీఎం నేతలు కలెక్టర హిమాన్షు శుక్లాకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు కాయంబు శ్రీనివాసులు, ప్రసాద్, కొండయ్య, ధనలక్ష్మి, వెంగమ్మ, వైష్ణవి, అశ్వని పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాహితీ ఉత్సవంలో 'పెరుగు'కు ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీలు బిహార్ ప్రభుత్వంతో కలిసి ఆసియాలోనే అతిపెద్ద సాహితీ ఉత్సవాన్ని ఈ నెల 25నుంచి 28 వరకు పాట్నాలోని సామ్రాట్ అశోక్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించాయి. 16 దేశాల నుంచి 555 మంది రచయితలు ఇందులో పాల్గొన్నారు. బిహార్ గవర్నర్ మహమ్మద్ ఆరీఫ్‌ఖాన్ ఉత్సవాలను ప్రారంభించగా, ముగింపు సభకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సాహితీ ఉత్సవంలో జిల్లా నుంచి ప్రముఖ అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. దిగులు లేని దేహం, మొహ స్వప్నం, అవతలి స్వరం అనే తెలుగు కవితలను ఆంగ్ల అనువాదం ద్వారా అందరికీ అర్థమయ్యేలా వినిపించి పెరుగు రామకృష్ణ పలువురి ప్రశంసలు పొందారు.



కవితలు చదువుతున్న పెరుగు రామకృష్ణ

జై భవానీ.. జైజై భవానీ!

● జోరు వర్షంలోనూ కలశాల ఊరేగింపు
● అడుగడుగునా భక్తుల నీరాజనం



నగరోత్సవంలో రాజరాజేశ్వరి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో అర్ధ మండలి దుర్గామాల కలిశాల ఊరేగింపు సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రత్యేక అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో జై భవానీ.. జైజై భవానీ అంటూ దుర్గామాలాదారులు నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పాత మున్సిపల్ కార్యాలయం పెన్నారేవులో పెన్నా జలాలను కలిశాలతో నింపుకున్నారు. శాస్త్రోక్తంగా పూజలు చేసి మేళతాళాలు, వేద మంత్రాలు, కర్పూర హారతులతో సంతపేట ఏసీబొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, శబరి శ్రీరామక్షేత్రం, కొండాయపాలెం గేట్ల మీదుగా రాజరాజేశ్వరి ఆలయంకు చేరుకున్నారు. కలిశాల ఊరేగింపు భక్తులకు ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు వేదపండితులు ఘనస్వాగతం పలికారు. ఊరేగింపు నిషాంత్‌రెడ్డి, అల్లూరు గిరీష్‌రెడ్డి, కొలపర్తి రమేష్‌కుమార్, చక్కా సునీల్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

గర్భిణులకు, చిన్నారులకు

ఉన్నచోటే పోషకాహారం

● అందించే దిశగా ప్రభుత్వం చర్యలు



కూరగాయల్లో పోషక విలువల గురించి బాలింతలకు వివరిస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఉన్న ఊరు నుంచి మరో ఊరికి వెళ్లినప్పుడు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందక వారు అనారోగ్యానికి గురయ్యేవారు. కానీ అలాంటి వారికి పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా, పోషకాహారం అందించేటప్పుడు స్థానికంగా లేకపోయినా వారు ఎక్కడున్నారో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సరకులు పొందటానికి అవకాశం కల్పించింది. గతంలో ఈ పరిస్థితి లేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ ట్రాకర్ యాప్ ద్వారా ఈ సౌకర్యం కలుగటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● జాతీయస్థాయి వరకు అందుబాటులోకి..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న గర్భిణులు, బాలింతలు, శిశువులు, ఆరేళ్లలోపు చిన్నారుల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆధార్ నంబరుతో స హా పోషణ్ ట్రాకర్ యాప్‌లో నవెూదు చేశారు. దీంతో వారి సమాచారం గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు అందుబాటులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న పోషకాహారం అర్హులకే అందనుంది. పక్కదారి పట్టడానికి అవకాశం లేదు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడే పోషకాహార సరకులు పొందే వీలు కలిగింది.

● తీసుకోవటం ఇలా...

ముత్తుకూరు నుంచి ఒక గర్భిణీ సూళ్లూరుపేటకు వెళ్లేటప్పుడు ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియ చేయాలి. ఆ తరువాత సూళ్లూరుపేటకు ఆమె వెళ్లినప్పుడు, సూళ్లూరుపేటలోని సంబంధిత ప్రాంత అంగన్‌వాడీకి తాము ముత్తుకూరు నుంచి వచ్చామని తెలియచేయాలి. ఆ తరువాత ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్తకు ఫోన్ చేయాలి. ముత్తుకూరులోని అంగన్‌వాడీ కార్యకర్త ఆమెకు సంబంధించిన మైగ్రేషన్ అని ఆప్షన్‌పై క్లిక్ చేస్తారు. వెంటనే సూళ్లూరుపేటలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఆ గర్భిణీకి పోసకాహారం అందుతుంది. ఇలా చేయటం ద్వారా వారు అక్కడ ఉన్నంత కాలం పోషకాహారాన్ని ఎలాంటి ఆటంకం లేకుండా పొందవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో స్థానిక అధికారులతో సమావేశం నిర్వ హిస్తారని ఐ అండ్ పీఆర్ అధికారులు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారని తెలిపారు. రాత్రి 8 గంటలకు ఆత్మకూరు కన్యకాపర మేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యవతీ యువకులకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా కంప్యూర్, వృత్తి నైపుణ్య కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని డ్రెడ్డి ఐటీ

కంప్యూటర్, వృత్తి నైపుణ్య

కోర్సులలో ఉచిత శిక్షణ

నిర్వాహకుడు కే.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866111223 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు. శిక్షణ పొందాలనుకునే వారు విద్యార్హత ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో కోవూరు పట్టణంలోని కొత్తూరు రోడ్డులో ఉన్న కేఎస్ఎన్ ఇంజనీరింగ్ కాలేజీలోని డ్రెడ్డి ఐటీ విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలి

● అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



ప్రసంగిస్తున్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి నూతన ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ అన్నారు. నగరంలోని ఐఎంఏ హాలులో సోమవారం డీఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపడుతున్న వారందరూ ఎంతో బాధ్యతగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా భావిభారత పౌరులను తీర్చిదిద్దాలన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని గౌరవిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, క్రమశిక్షణను పెంపొందించి ఉత్తమ భారతీయ పౌరులుగా తయారు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం అందించే శిక్షణలో పాల్గొని పాఠశాలల్లో చేరే నాటికి పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని తెలిపారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం దేశహితం కోసం, విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయులందరికీ అపస్ అండగా ఉంటుందని, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన విద్యా వ్యవస్థలో సమష్టిగా పనిచేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలల్లో విధులు, నిర్వహణ, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు కేకే.రాజగోపాలాచారి, ప్రధాన కార్యదర్శి పీ.అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.చక్రపాణి, నేతలు రామకృష్ణ, రమేష్‌బాబు, చంద్రమౌళి, మణికందరాచారి, రాజేశ్వర్‌రావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 78 వినతులు



నడవలేని వృద్ధుడు వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరం లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 78 మంది వారి సమస్యలు తెలుపుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్. రామారావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ టీ. శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

● అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

● పొదలకూరుకి చెందిన శ్రీనివాసులు, హైదరాబాదుకి చెందిన రవికుమార్‌లు వేదాయపాలెంకి చెందిన ఓ వ్యక్తికి క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధికంగా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపించారు. దీంతో ఆయన రూ.8 లక్షల పెట్టుబడి పెట్టారు. అయితే అధిక ఆదాయం రాకపోగా తాను పెట్టుబడి పెట్టిన నగదు ఇవ్వాలని కోరుతుంటే వారు నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

● చేజర్లకి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన దాసరి బాబు మోసం చేసాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని బాధితురాలు తెలిపింది. అయితే కేసు వెనక్కి చేసుకోవాలని తన వెంట బడుతూ వేధిస్తూ బెదిరిస్తున్నాడని ఆ మహిళ ఫిర్యాదు చేసింది.

● ఉదయగిరికి చెందిన ఓ వ్యక్తి పెద్ద కుమార్తె గత ఫిబ్రవరిలో ఉదయగిరి ఆనకట్టలో పడి చనిపోయినట్లు, ఉదయగిరి స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, అయితే తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని, లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ వ్యక్తి కోరారు.

రక్షణ కల్పించి, న్యాయం చేయండి...

● తనకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ నాయకురాలు కందికట్ల రాజేశ్వరి పోలీసు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదలకూరు మండలం మరుపూరులోని తన సొంత పొలంలో గత నెల 26న కొందరు టేకు చెట్లను దొంగతనంగా నరికి తీసుకెళ్లారన్నారు. ఈ ఘటనపై పొదలకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, స్పందించక పోగా కేసు తప్పు దోవ పట్టించారని ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక దాడి

● కొత్త మినగల్లులో ఘటన



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు పట్టా శ్రీకాంత్

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త మినగల్లులో పాతకక్షల నేపథ్యంలో టీడీపీకి చెందిన నలుగురు యువకులపై వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన పట్టా శ్రీకాంత్‌కు రెండు కాళ్లు విరిగాయి. బంధువులు ఘటనాస్థలికి వెళ్లేసరికి శ్రీకాంత్‌ని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. చింతల రమేష్‌ను కూడా పట్టుకున్నారని శ్రీకాంత్ చెప్పిన సమాచారంతో ఆయన కోసం గాలించినా ఆచూకీ తెలియ లేదు. రమేష్ చొక్కా, బనియన్ మాత్రం శ్మశానం పక్కన పొలాల్లో పడివుండడం చూశామని శ్రీకాంత్ అన్న శ్రీహరి తెలిపారు. శ్రీహరి తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాంత్‌తోపాటు అతడి అన్న, బావమరిది, రమేష్ గ్రామ శివారులో పుట్టిన రోజు వేడు కలు చేసుకోవడాన్ని చూసిన వైసీపీ నాయకులు మారణాయుధాలతో శ్రీకాంత్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో రమేష్ ఆచూకీ తెలియలేదని బాధితులు చెప్పారు. గతంలో పలు సార్లు దాడులకు పాల్పడ్డారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాగా శ్రీకాంత్‌పై హత్యాయత్నానికి పాల్పడిన మోచర్ల, రామ్మోహన్, అఖిల్, కౌశిక్, ఆ శీస్సు, నారయ్య, నవీన్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న నెల్లూరు రూరల్ సీఐ వేణు, బుచ్చి ఏఎస్ఐ వెంకయ్య, సిబ్బందితో కొత్త మినగల్లు వెళ్లి విచారించారు.

● విద్యార్థిపై దాడి

టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేష్‌ను పొగిడే పాటలను చింతల త్రిలోక్‌సాయి అనే పాలిటెక్నిక్ విద్యార్థి తన ఫోన్‌లోని ఇన్‌స్టాగ్రాం, స్టేటస్‌లో పెట్టుకున్నాడు. అలాగే పుస్తకాలు పెట్టుకునేందుకు పసుపు, ఎరుపు రంగులుండే బ్యాగు కొన్నాడు. అది నచ్చని వైసీపీ నాయకులు ఆ బ్యాగు వాడవద్దని హెచ్చరించారు. వినకపోవడంతో ఆ విద్యార్థిపై కూడా దాడి చేశారు.

వైద్యుల సమ్మెతో రోగుల అవస్థలు

ఏఎస్ పేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారించాలని పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేపట్టడంతో వారికి మద్దతుగా ఏఎస్‌పేట, చిరమన పీహెచ్‌సీ వైద్యులు సోమవారం విధులకు హాజరు కాలేదు. దీంతో రోగులు అవస్తలు పడ్డారు. ప్రతిరోజు 70 నుండి 90 మంది విచ్చేసే రోగులు కేవలం 30మంది లోపు మాత్రమే రావడంతో వారికి స్టాఫ్‌నర్సులు చికత్స అందించారు. పలువురు రోగులు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11055
వెండి కిలో ధర	రూ. 148200
వెండి ఒక గ్రాము	రూ. 151.20

న్యూస్ బాక్స్

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా



ప్రజల అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. అందులో భాగంగా వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించారు. ప్రజల వద్ద నుండి నేరుగా అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధించిన అధికారులను వెంటనే సంప్రదించి, త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. గ్రామ సమస్యలను మండల స్థాయిలో పరిష్కరించుకోవాలని, పరిష్కారం కాని సమస్యలను తమ వద్దకు తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. అందరం కలిసికట్టుగా ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.

రాయితీపై డ్రోన్ పంపిణీ



గ్రూపు సభ్యులకు డ్రోన్ అందజేస్తున్న అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మాల కొండ స్వామి రైతుమిత్ర గ్రూపు సభ్యులకు రాయితీపై డ్రోన్‌ను తహసీల్దారు వై నాగ రాజు, మండల వ్యవసాయాధికారి మదన్ మోహన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి లోక్‌నాథ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

అనంతసాగరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు లేవని, తాగునీరు కలుషితంగా వస్తున్నట్లు తెలిపారు. గిరిజన కాలనీలో వంకపై చెక్‌డ్యాం నిర్మించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, అంకయ్య, వంశీ, వెంకటేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వోకు సన్మానం

సంగం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సంగం వీఆర్వోగా పనిచేస్తున్న బి మోహన్ రావు సోమవారం పదవీ విరమణ చేయడంతో తహసీల్దారు సోమ్లానాయక్, తోటి వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వీఆర్వో దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జ్యోతి, తోటి వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మర్రిపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాట గ్రామంలో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడిచేశారు. అందిన సమాచారంతో ఓ పాడుపడిన ఇంటిలో పేకాట ఆడుతుండగా ఎస్ఐ శ్రీనివాస్‌రావు తన స్పిందితో కలిసి దాడిచేసి తొమ్మిది మందిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4600 స్వాధీనం చేసుకొని స్వంత పూచీకతుపై పంపించేశారు.

ఎంఈవో కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ఉదయగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రెండో సెమిస్టార్ పాఠ్యపుస్తకాలు సోమవారం ఎంఈవో కార్యాలయానికి చేరినట్లు ఎంఈవో-2 టీ. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 9,530 పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో దేవేరులు



ఉదయగిరి శివాలయంలో సరస్వతీదేవి అలంకరణలో పార్వతీదేవి



సంగమేశ్వరాలయంలో సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షిదేవి



సంగం: సరస్వతిదేవి అలంకారంలో పాలేటి గంగమ్మ

ఉదయగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ, మండలంలోని



వరికుంటపాడులో సరస్వతిదేవి అలంకరణలో నాగవరపమ్మ

గండిపాళెం నాగారప్పమ్మ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

● **సంగం :** స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కామాక్షిదేవి సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో సరస్వతిదేవి చెంత నోటు పుస్తకాలు, పెన్నులు ఉంచి పూజించారు. అనంతరం కామాక్షిదేవికి పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న పాలేటి గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గంగమ్మతల్లిని దూదితో సరస్వతిదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు మహాగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరకుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



తూర్పురొంపిదొడ్లలో మహాగౌరీ అలంకరణలో మానసాదేవి

జ్వాలాముఖి ఆలయానికి విరాళం



జ్వాలాముఖి ఆలయానికి రూ. 1 లక్ష డిపాజిట్ బాండ్‌ను ట్రస్ట్ బోర్డు కమిటీకి అందచేస్తున్న దాతలు

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్వాలాముఖి, విష్ణేశ్వర, అభయాంజనేయస్వామి ఆలయానికి ఆత్మకూరుకు చెందిన కొలగాని సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని అమ్మణ్ణమ్మ ఆధ్వర్యంలో వారి అల్లుళ్లు, కుమార్తెలు రూ. 1 లక్ష విరాళం దేవస్థానం పేరుతో ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్‌ను ట్రస్ట్ బోర్డు కమిటీకి సోమవారం అందచేశారు. దీంతో దాతలను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాతలు సువర్ణ నాగరాజు- సునందలక్ష్మి, చలంచర్ల శ్రీనివాసరావు- సునీత (కోఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్)లు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి సారూ...

● కలెక్టరుకు గిరిజన కాలనీవాసుల వినతి

ఏఎస్ పేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి తాగునీరు అందించాలని సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ఏఎస్‌పేట మండలం గుడిపాడు గ్రామ పంచాయతీలోని గిరిజన కాలనీవాసులు కలెక్టరుకు వినతిపత్రం అందించారు. పెన్నా నీరు గత కొన్ని నెలల అందడం లేదని, దీంతో తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నామని, గ్రామ నాయకులు, అధికారులు పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేసి సమస్యను పరిష్కారించాలని కలెక్టర్‌ను కోరారు.

మొండి బకాయిలపై దృష్టి సారించండి

ఉదయగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలపల్లి సహకార సొసైటీ ద్వారా రుణాలు పొంది సక్రమంగా చెల్లించని మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టిసారించి నూరు శాతం రికవరీ సాధించాలని సొసైటీ ఛైర్మన్ గడ్డం వెంకటసామయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన సర్వజన మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే మరొకరికి రుణం సౌకర్యం కలగడంతో పాటు సొసైటీ అభివృద్ధి చెందుతుందన్నారు. సొసైటీ పరిధిలో ఉన్న మొండి బకాయిదారులు త్వరితగతిన రుణ బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, సొసైటీ డైరెక్టర్లు నల్లిపోగు రాజా, బొజ్జా నరసింహారావు, సీఈవో రేకలగుంట పోలయ్య, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ప్రజాసమస్యల పరిష్కారం ఎలా..!?

● మొక్కుబడిగా హాజరైన అధికారులు



హాజరైన ముగ్గురు అధికారులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెలవెలబోయింది. సుమారు 18 శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా కేవలం మండల పరిషత్ కార్యాలయ ఏవో రాజశేఖర్, ఏపీవో ఆజంఖాన్, హౌసింగ్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ నాయబ్‌రసూల్ మాత్రమే హాజరవడం గమనార్హం. ఇలాగైతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి వారం అన్ని శాఖల అధికారులు తప్పక హజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 1290 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 1072 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 218 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 335 కాగా, కనిష్ఠ ధర రూ. 80 పలికినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

పౌర హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం



ఉదయగిరి: పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెర్లోపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో సివిల్స్ రైట్స్‌డే కార్యక్రమం లో భాగంగా సోమవారం తహ సీల్దారు ఎల్.రామ్మోహన్ మం డలస్థాయి అధికారులతో కలిసి పౌర హక్కులపై కాలనీ వాసు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీ.శ్రీనివాసులు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూ రమణారెడ్డి, ఏఈలు శ్రీనివాసరాజు, జగన్నాథం, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సభ్యులు రఘు, సుదర్శన్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సంగం :** మండలంలోని కొరిమెర్ల ఎస్టీ కాలనీలో సోమవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం మొక్కుబడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల స్థాయి రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్, ఐసీడీయస్, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ ఈజీఎస్, విద్యాశాఖ వంటి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలి. కానీ ఒక్క రెవెన్యూ శాఖ అధికారులు మాత్రమే హాజరై మొక్కుబడిగా నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వింజమూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

వింజమూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల కోసం ధాన్యం కొనుగోలును ఏర్పాటు చేసిందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ సీఈవో మేకల రమణయ్య యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సంగం :** స్థానిక సొసైటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, డైరెక్టర్‌లు పిట్టు పట్టాభిరామిరెడ్డి, జనార్ధన్ రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరుణవాయి, సంగం-1, సంగం -2, కొరిమెర్ల, పెరమన రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారని, ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్దతు ధర ప్రకారం ఏగ్రేడ్ రకం పుట్టి రూ. 20,306, సాధారణ రకం పుట్టి 20,136కు కొనుగోలు చేయనున్నట్లు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీధి వ్యాపారులకు రూ.2.36 కోట్ల రుణాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్ పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం లోక్ కల్యాణ మేళా అట్టహాసంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషన్ గంగాప్రసాద్ మాట్లాడుతూ 2210 మంది వీధి వ్యాపారులకు రూ. 2.36 కోట్ల రుణాలు ఇచ్చారన్నారు. మొదటి విడత రూ. 10వేలు నుంచి 15వేల వరకు రుణాన్ని పెంచడం జరిగింది. రెండవ విడత రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి రూ. 50 వేల రుణ సదుపాయం కల్పించారు. అనంతరం వీధి విక్రయదారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ టీడీపీ పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సీడీపీవో సునీలత, మెప్మా అధికారులు, పురపాలక సంఘంలోని బ్యాంక్ మేనేజర్లు, లేబర్ డిపార్టుమెంటు, సివిల్ సప్లైయ్, హెల్త్, ఫుడ్ సెక్యూరిటీ, ఐసీడీయస్ అధికారులతోపాటు వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రెండు కార్ల ఢీ : తప్పిన ప్రమాదం



విచారిస్తున్న పోలీసులు

సంగం, సెప్టెంబరు 29: మండల పరిధిలోని సంగం కొండ సమీపంలో ముంబాయి జాతీయ రహదారి కూడలిలో సోమవారం రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న కారు కొండ దిగే ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్ల వద్ద బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొని కొంతదూరం ముందుకు నెట్టుకుపోయింది. అయితే కారులో ప్రయాణం చేస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

నెల్లూరురూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై ఎక్స్ వేదికగా అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన అంజత్‌ఖాన్ ఇలాంటి పోస్టుల పెట్టిన కేసుల్లో ఇప్పటికే జైల్లో ఉన్నాడు. ఇతనిపై నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన జనసైనికుడు సీదార్ల నాగేంద్రబాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడిని పీటీ వారెంట్‌పై బయటకు తీసుకువచ్చి తాజాగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాడుతున్న గుర్తుతెలియని వృద్ధుడుని ప్రమాదవశాత్తు గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సౌత్‌రైల్వే స్టేషన్ వద్ద సోమవారం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించిన సుమారు 75 నుంచి 80 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇళ్లమధ్యలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిర్వాహకులు పరారీలో ఉండగా విటుడును పోలీసులు అరెస్ట్ చేసి, ఇద్దరు సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కళ్యాణి, మురళిలు పోస్టల్ కాలనీ మూడోవీధిలోని ఓ ఇంటిని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బదితో కలిసి వ్యభిచార కేంద్రంపై దాడి చేశారు. పొదలకూరు మండలంకు చెందిన విటుడు మహేష్‌ను అరెస్ట్ చేసి ఇద్దరు సెక్స్ వర్కర్లును అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన వృద్ధురాలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై వైద్యశాలలో చికిత్స పొ ందుతున్న వృద్ధురా లు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. పుష్పమ్మ(65) ఆత్మకూరు బస్టాండు పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుని జీవనం సాగించేది. రాత్రి వేళల్లో ఫ్లైవోవర్ బిడ్జి కింద, సమీపంలోని దుకాణాల వద్ద నిద్రించేది. ఈనెల 27వ తేదీన ఆత్మకూరు బస్టాండు ఫ్లవర్ మార్కెట్ సమీపంలో మినీబైపాస్ వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఆమెను వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు 45వ వార్డు వీఆర్‌వో చందన సోమవారం నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణ తెలిపారు.

యువతి మెడలో గొలుసు చోరీ

మనుబోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న యువతి మెడలోంచి ఇద్దరు ఆగంతకులు గొలుసు లాక్కెళ్ళిన సంఘటన మనుబోలులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు స్థానిక కోదండరామాపురానికి చెందిన మల్లి విజయ కొద్ది నెలలుగా స్థానిక ఓ సూపర్‌మార్కెట్‌లో పని చేస్తోంది. డ్యూటీ ముగించుకుని దుకాణం నుంచి ఇంటికి వెళుతుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై యువతికి ఎదురొచ్చారు. యువతిదగ్గరకు రాగానే మోటార్ సైకిల్ వెనుకున్న యువకుడు హఠాత్తుగా విజయ మెడలోంచి చైన్ తెంపుకొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. వెంటనే విజయ కేకలు వేయడంతో స్థానికులు యువకులను పట్టుకునే ప్రయత్నం చేసినా వారు పరారయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 2 సవర్ల బంగారు గొలుసు రూ. 2 లక్షల ఖరీదు ఉంటుందని యువతి విలపించింది.

అందని వైద్య సేవలు...

ఎంఎల్‌హెచ్‌పీనే దిక్కు!



విధులు నిర్వర్తిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సమ్మె కారణంగా మండల కేంద్రమైన వరికుంటపాడులోని వైద్యశాలకు ఎంఎల్ హెచ్ పీనే దిక్కుగా మారింది. సోమవారం కేవలం ఎల్‌టీ, ఫార్మాసిస్టు మాత్రమే విధులకు హాజరయ్యారు. వైద్యశాల పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు బదులుగా పెద్దిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో విధులు నిర్వర్తించే ఎంఎల్ హెచ్‌పీకి విధులు అప్పగించి చేతులు దులుపుకున్నారు. దీంతో గ్రామం లోని క్లినిక్ తలుపులు తీసే నాథులే కరువయ్యారు. ఈనేపథ్యంలో వైద్యం కోసం అక్కడికి పరుగులు తీసిన రోగులు చేసేదేమిలేక మౌనంగానే వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యశాలలోను నాడీ పట్టే పరిస్థితులు లేకపోవడంతో సిబ్బంది అందించే అరకొర మందులతోనే కాలం వెల్లబుచ్చాల్సి వచ్చిందని పలువురు వాపోతున్నారు.

రోడ్లు కాదు.. మురుగు నీటి కాలువలు

కావలి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెంచుగానిపాలెంలో మురుగు కాలువలు లేక ఇళ్ల లోని నీరు మొత్తం రోడ్ల పైన నిల్వ ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. సీసీ రోడ్లు ఏర్పాటు చేసినప్పటికి మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టక పోవడంతో ఇళ్ల ముందే మురుగునీరు నిలుస్తుండడంతో దుర్గంధం భరించలేకపో తున్నామన్నారు. దోమల బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీటి కాలువల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెంచుగానిపాలెంలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఇంటూరి



చినపవనిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగిరేకులపాడు, చినపవని, సత్యనారాయణపురం, మేదరమెట్ల పాలెం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.2.34 కోట్ల నాబార్డు నిధులతో అంగిరేకులపాడు, సత్యనారాయణపురం వరకు నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. అలాగే సత్యనారాయణపురంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే మేదరమెట్ల పాలెం, చినపవని గ్రామాలలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గోకులం షెడ్లు, చెత్త తయారీ సంపద కేంద్రాన్ని ప్రారంభించారు.

మౌలిక వసతుల కల్పనకు సిద్ధం

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవనకల్యాణ్‌లు నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులే లక్ష్యమన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ జి చంద్రమౌళి, ఏఈ హనుమంతరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, సిఎల్ఆర్సీ కోర్సు డైరెక్టరు జె బాబూరావు, ఏపీఓ సమీరబాషా, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, కె నాగేశ్వరరావు, సర్పంచు కె మాధవి, జి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ప్రభుత్వ బాధ్యత



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న జేవీవీ సభ్యులు, వైద్యులు

కావలి (టౌన్)సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ తీవ్రమైన పర్యావరణ సమస్యగా మారిందని, ప్లాస్టిక్ నిషేదం ప్రభుత్వ బాధ్యత అని చిన్నపిల్లల వైద్య నిపుణుడు మనోహర్‌బాబు, మైక్రోస్కోపిక్ సర్జన్ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం టీవీఎస్ ట్రస్ట్ అధ్యక్షుడు తోట వేంకటేశ్వర్లు అధ్యక్షతన ఆర్టీసీ కూడలిలో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన, గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమం జరిగింది. డాక్టర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు. 'ప్లాస్టిక్ వద్దు-గుడ్డ సంచులు ముద్దు' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు సుబ్బరాయశర్మ, ఖాదర్‌బాష, కందికట్టు నారాయణ, శారద, కలయ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కావలి (టౌన్) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోజువారీ ప్రాతిపదికన పని చేసే మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి పర్మినెంట్ చేయాలని సీఐటీయు నాయకులు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి పి తిరుపాల్ మాట్లాడుతూ పట్టణంలో రోజువారీ కార్మికులుగా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న రోజువారి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు వై కృష్ణమోహన్, పెంచలయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు జే బాబు, ఒంగోలు రమేష్, తన్నీరు దొరసాని, ఒ రాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందే తల్లులు, గురువులు

ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి,సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లే తల్లులు, గురువులుగా వ్యవహరించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లుగా నియమితులైన 30 మందికి సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే, సీడీపీవో సౌజన్య నియామక పత్రాలు అందచేశారు. సీఎం చంద్రబాబు పేదల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్.. ఓ వరం

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం 47 మందికి రూ.30,50,513ల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల వరకు బీమా సౌకర్యం లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిశోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరు శ్రీనివాసులు, బండి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బిట్రగుంట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతల కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బోగోలు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటేశ్వర్లు, కడనూతల మాజీ సర్పంచు చల్లా నారాయణను ఎమ్మెల్యే పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాసరి శ్రీనివాసులు తండ్రి వెంకయ్య ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబంతోపాటు, శెట్టిపల్లి రాజశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగులవరం టీడీపీ నేత కాండ్ర గోవర్థన నాయుడు భార్య రత్నమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాలేపాటి శ్రీహరినాయుడు, పాముకాటుకు గురైన టీడీపీ మహిళా నాయకురాలు మాధవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కొండబిట్రగుంటకు చెందిన యన్నాబత్తిన రమాదేవిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండలం కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, ఎల్ సుధీర్‌బాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర రెడ్డి, ఎల్ మాధవరావు, కే తిరుమలేష్, బీ ప్రభాకర్, కాండ్ర రఘురామనాయుడు, రామసుబ్బయ్య నాయుడు, డీ తిరుపతియాదవ్, ప్యాట్రిక్, అర్పత్‌రాజు, జిల్లా బీజేపీ నాయకుడు ఎన్ఎస్ యాదవ్, పీ శీనయ్య, రాజేశ్వరి, పీ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కందుకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాటర్పిల్లర్ వంటి ప్రముఖ బహుళజాతి సంస్థల్లో సాధించిన ఉద్యోగాల వెనుక అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధే కారణమని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాల అంతర్గత నాణ్యతాభివృద్ధి మండలి సమన్వయంతో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టరు సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ కె శ్రీహరి, రిసోర్స్ పర్సన్స్‌తో కలిసి సోమవారం కృత్రిమ మేథస్సు తాజా ధోరణులపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించగలరన్నారు. కార్యక్రమానికి కశ్రీ సతీష్, వి. బాలాజీ, చుంచు నరేష్‌బాబులు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్‌డే !

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : నారాయణ ఆసుపత్రిలో ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రామ్‌కుమార్ గుండె వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



అల్లూరు : సరస్వతీగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కందుకూరు : సరస్వతీదేవిగా దుర్గాభవానీ అమ్మవారు



బిట్రగుంట : సరస్వతిదేవిగా రాజరాజేశ్వరిదేవి

అల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం అల్లూరులోని స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నార్తుమోపూరులోని పర్వతవర్థిని అమ్మవార్లు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కలుగోళమ్మ, పార్వతీ అమ్మవారు, గంగమ్మ, అంకమ్మల ఆలయాల్లో విశేషంగా పల్లకీ సేవలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కందుకూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవత, ఆదిపరాశక్తి అంకమ్మ అమ్మవారితో పాటు కోవూరురోడ్డు లోని దుర్గాభవానీ అమ్మవారు, పెద్దబజారులోని సరస్వతీదేవి ఆలయంలో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట కోదండరామాలయంలో రాజరాజేశ్వరీదేవి సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. బోగోలు షిరిడీసాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కలిగిరి : మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు సోమవారం భక్తులకు కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతస్థాపన అభిషేకాలతోపాటు కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 508 పసుపుకొమ్ములకు పూజలు నిర్వహించి భక్తులకు పంచిపెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కావలి (టౌన్): గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహన సేవలందుకున్నారు. శ్రీ వాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు మాతంగీశ్వరి అలంకారం లో, కొత్త బజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మహిళా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు ధనలక్ష్మీ అలంకారంలో వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బృందావనం కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ఉదయం హనుమంత వాహన, సాయంత్రం వసంతోత్సవం, పుష్పపల్లకీ ఉత్సవం, రాత్రి గజవాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళల కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి

కలెక్టరు, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరు హిమాన్షుశుక్లా, ఎస్పీ అజిత వేజెండ్లను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాల అమలు, నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరుతో, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీతో చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

టీ. సుబ్బరామిరెడ్డికి వేల కోట్ల రుణాలు రద్దు అన్యాయం



ఆందోళన నిర్వహిస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత టీ సుబ్బరామిరెడ్డికి రూ.5,871 కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయటం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. పేదలకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వకుండా, బడా పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రుణాలు ఇచ్చి రద్దు చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు జే. విజయరత్నం, నరసింహారావు, భాస్కర్, లక్ష్మీనర్సు జెడ్డా వాసు పాల్గొన్నారు.

కిమ్స్ ఆధ్వర్యంలో 3 కే వాక్

నెల్లూరు(వైద్యం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హృదయ వ్యాధుల దినోత్సవం సందర్భంగా 3 కే వాక్ నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బ్రాహ్మణక్రాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. బ్రాహ్మణక్రాక రైతు పండించిన ధాన్యాన్ని ఎమ్మెల్యే ట్రాక్టర్లో కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించారు. ధాన్యం నాణ్యత, నెమ్ము శాతం తెలుసుకునే యంత్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రం సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా పొరపాటు లేకుండా పార్టీలకతీతంగా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించాలని ఆదేశించారు. పరిమితికి మించి యూరియా వాడకం వల్ల పంటకు, భూమికి కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ ఏడీఏ, ఏఓలకు సూచించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భూసాంద్రత పెంచుకునేలా ప్రతీ రైతు కృషి చేయాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో రాళ్ళపాడు లాంటి ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గత పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తాను నియోజకవర్గంలో 149 చెరువులు పటిష్ఠపరిచేందుకు సోమశిలప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ మధురెడ్డి సహకారం తీసుకున్నానన్నారు. కాలువలు, చెరువుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ పీ మధురెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, జలదంకి సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు అప్పలనాయుడు, మధుసూదన రెడ్డి, జానీతో పాటు కూటమి నేతలు పూనూరు భాస్కర్ రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, పున్నం రోశిరెడ్డి, డాక్టర్ సాయికుమార్, వడ్డే అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మెన్ కదిరి వెంకట రంగారావు ప్రారంభించారు. గోనె సంచులు, రవాణా, కూలీల ఖర్చు ప్రభుత్వమే భరించి క్వింటాల్‌కి గరిష్టంగా రూ.2389 మద్దతు ధర అందిస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారుల వద్ద అమ్ముకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సరైన మద్దతుధరకు అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కలిగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారావు తదితరులు

ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్వవైభవం కల్పించండి



పాడుబడిన బస్టాండ్‌ను గ్రామస్థులతో కలిసి పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ఉలవపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్వవైభవం కల్పించాలని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి గ్రామస్తులు వినతి పత్రం అందచేశారు. గత 15 ఏళ్లుగా వినియోగంలో లేకుండా పాడుపడిపోయిన ఆర్టీసీ బస్టాండ్‌ని సోమవారం జోనల్ ఛైర్మన్ పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆయనను కలిసి ప్రయాణికులకు సరైన షల్టర్ లేకపోవడంతో ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌కు పూర్వ వైభవం కల్పించి మండల ప్రజలకు ప్రయాణ వెసులుబాటు కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో మాజీ సర్పంచు జీ ప్రసాదు, సీహెచ్ రాజారెడ్డి, కే కృష్ణారెడ్డి, పెద్దన్న శెట్టి, దసియ్య, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు



తహసీల్దార్ శ్రీనివాసులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు మణికంఠ పవన్‌కుమార్

ఉలవపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలలో బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకొని ప్రజాపంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని జనసేన నాయకుడు మణికంఠ పవన్‌కుమార్ సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన డిజిటల్ కార్డులు పంపిణీ సక్రమంగా చేపట్టని ఒక డీలర్ తన సమీప బంధువుకు అప్పగించి డిజిటల్ వ్యాపారం చేయిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని, సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ పంచాయతీల్లో జీఎస్టీపై అవగాహన కల్పించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అక్టోబరు 18వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రాగ్రూపు లీడర్లు, వీఓఏలు, ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని తెలిపారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. హైస్కూల్, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించుట, మోటారుబైకు ర్యాలీలు తదితర కార్యక్రమాలతో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అక్రమంగా జామాయిల్ కర్ర నరికివేత

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): తన పొలంలో జామాయిల్ కర్రను గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నరికివేసి తరలించుకుపోయినట్లు స్థానిక చందాడి కోటయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం పొలంలోకి వెళ్లి చూడగా జామాయిల్ చెట్లు నరికివేసి తరలించుకు పోయారని, సుమారు రూ. 10 వేలకు పైగానే ధర ఉంటుందని కోటయ్య వాపోయాడు.

వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కుమార్

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని సిఐటీయు జిల్లా నాయకుడు కుమార్ తెలిపారు. మండలంలోని చెర్లోపాలెంలో జిల్లా కమిటీ అధ్యక్షులు జాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు, అబివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం మూడు పంటలు పండే కరేడులో వేల ఎకరాల భూములను రైతుల వద్ద బలవంతంగా సేకరించి ఒక ప్రయివేట్ వ్యక్తికి కట్టబెట్టడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరి జాన్, దార్ల నారాయణ, రవి, నాగార్జున శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఐడబ్ల్యూఐడీసీ డైరెక్టర్‌గా పోకూరి ప్రమాణ స్వీకారం



రాంబాబును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు,(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమం, మౌలికవసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పోకూరి రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం అమరావతి సమీపంలోని కుంచనపల్లి ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం: 8-10 మధ్య
సూర్యప్రభ వాహనం
మధ్యాహ్నం: 1-3 మధ్య
స్నపన తిరుమంజనం
రాత్రి: 7-9మధ్య
చంద్రప్రభ వాహనం





గజ వాహనం ముందు అమ్మవార్ల అలంకరణలతో కళా ప్రదర్శన

ముచ్చటగా మూడు వాహనాలు





తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మలయప్పస్వామి మూడువాహనాలపై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఉదయం 9 గంటలకు కోదండరాముడిగా హనుమంతవాహనంపై.. సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథంపై.. పట్టాభిషేకానికి వెళ్లే రారాజులా రాత్రి 7 గంటలకు గజవాహనంపై భక్తకోటిని అనుగ్రహించారు. పెరటాశి రెండో శనివారం, ఆదివారం గరుడసేవ సందర్భంగా తిరుమల కిటకిటలాడింది. ఆదివారం అర్ధరాత్రికే చాలా మంది తిరుగు ప్రయాణం కావడంతో రద్దీ సాధారణస్థితికి చేరుకుంది. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. అయినా, భక్తులు గ్యాలరీల్లోనే కూర్చుని వాహన సేవలను వీక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెరీగుడ్.. బాగా చేశారు

టీటీడీకి 'ఎక్స్'లో సీఎం అభినందనలు



'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన మలయప్ప స్వామి గరుడవాహన సేవ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీటీడీకి అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. శ్రీవారి ఆలయం, గరుడ వాహనసేవ, శ్రీవారి సేవకుల సేవలు, భక్తుల ఫొటోలను తన పోస్టుకు జత చేశారు. గరుడ సేవకు తరలివచ్చిన 3 లక్షల మందికి పైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి మంచి అనుభూతిని మిగిల్చారని కొనియాడారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన, సమన్వయంతో వ్యవహరించిన టీటీడీ బోర్డు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా అడ్మినిస్ట్రేషన్, పోలీసులకు అభినందనలు తెలిపారు. 'తిరుమల కొండ పవిత్రతను కాపాడుతూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించిన భక్తకోటికి ధన్యవాదాలని పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బంగారు కుటుంబానికి ఆటో

- పీ4 కార్యక్రమంలో 'మార్గదర్శి'గా అందించిన రాస్



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా దత్తత తీసుకున్న కుటుంబానికి 'రాస్' ఆటోను అందించింది. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురానికి చెందిన సతీష్ ఆటో డ్రైవర్. అనారోగ్య సమస్యలతో సుమారు రూ.20లక్షల వరకు ఖర్చు చేశారు. దీంతో జీవన పరిస్థితి దుర్భరంగా మారింది. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన గోడు వెల్లబోసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ద్వారా రాస్ సంస్థను కలెక్టర్ సంప్రదించారు. బంగారు కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా రాస్ సంస్థ ముందుకువచ్చింది. సంస్థ అందించిన ఆటోను బాధిత కుటుంబానికి సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అందజేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంటకరత్నం, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాలకు దసరా కానుక

వాహన మిత్ర ద్వారా 14,375మందికి లబ్ధి

తిరుపతి(రవాణా), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు దసరా కానుకగా ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని ప్రకటించింది. జిల్లాలో ఈ పథకం ద్వారా 14,375మంది ఆటోడ్రైవర్లకు రూ.15వేలు చొప్పున జమ చేయనుంది. 14,757మంది దరఖాస్తు చేసుకోగా 14,375 మంది అర్హుల పేర్లను ప్రకటించింది. అక్టోబరు 1న సీఎం చంద్రబాబు వారి ఖాతాల్లో డబ్బు జమ చేయనున్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా తమ ఉపాధికి గండిపడుతోందని డీలాపడ్డ ఆటోడ్రైవర్లు ప్రస్తుతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి



అర్హులైన ఆటోడ్రైవర్లందరికీ వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఆదాయపు పన్ను, నెలవారి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటినా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థిరాస్తి ఉన్న వారికి వర్తించదు.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖాధికారి

నిషేధిత జాబితా నుంచి ఆటోనగర్ స్థలాలకు విముక్తి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆటోనగర్ స్థలాల రిజిస్ట్రేషన్లపై 22ఏ నిషేధాన్ని ఎత్తివేశారు. సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటోనగర్ యజమానులుఊరట చెందారు. చాన్నాళ్లుగా వీరు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. చట్టబద్ధంగా యజమానులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. 337 ఆటోమొబైల్ యూనిట్లకు ప్రయోజనం చేకూరింది.

స్వర్ణరథంలో మెరిసిన మలయప్ప

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వర్ణరథంలో దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. 4 నుంచి 5.10 గంటల వరకు స్వర్ణరథంలోని దేవదేవులను భక్తులు దర్శించారు. చల్లని వాతావరణం, మధ్యమధ్యలో చిరుజల్లుల నడుమ బంగారు రథం శోభాయమానంగా సాగింది. ఈ స్వర్ణరథాన్ని మహిళలు మాత్రమే లాగడం విశేషం. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని గోవిందనామస్మరణలతో స్వర్ణరథం మోకులను పట్టుకుని లాగారు. భక్తులు, శ్రీవారి సేవకులు, అప్పుడప్పుడు భద్రతా సిబ్బంది సహకరించడంతో స్వర్ణరథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై శ్రీవారు దర్శనమిచ్చారు. ఆయా వాహన సేవల్లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సంప్రదాయ నృత్య నీరాజనం

కేరళ యక్షగానం, పాండిచ్చేరి ఫోక్ డ్యాన్సు, మైలట్లం, కర్ణాటక పిన్నాల్ అండాళ్ డ్యాన్స్, తెలంగాణ బృందం కోలాటం, ఢిల్లీ కళాకారుల చౌమయూర్ బంజ్, జమ్ము కశ్మీర్ రౌఫ్, పంజాబ్ లూథి నృత్యాలు.. ఇలా సోమవారం ఉదయం 26 కళా బృందాల్లోని 607 మంది కళాకారులు హనుమంత వాహనం ముందు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఒడిశా సంబల్పూడి గౌటిపు, మహారాష్ట్రకు సంబంధించి గోందళ్ నృత్యాలతో పాటు శ్రీరామ పట్టాభిషేకం, రామావతారం వంటి పౌరాణిక ఘట్టాలను నృత్య రూపకం ద్వారా ప్రదర్శించారు. ఇక, రాత్రి గజ వాహన సేవలో కర్ణాటక కళాకారుల గజేంద్ర వైభవం, బంజారా నృత్యం, తిరుపతి కళాకారుల మయూర నృత్యం, కోలాటం, గజేంద్రమోక్షం వంటి సంప్రదాయ నృత్యాలు.. తెలంగాణ కళాకారుల పేరిణి.. ఒడిశా కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు కళా వైభవాన్ని చాటాయి. కీలుగుర్రాల ప్రదర్శన, అష్టలక్ష్మి వైభవం, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

రికార్డుస్థాయిలో భక్తుల 'ఘాట్' ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడసేవ రోజున రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ఘాట్‌లో ప్రయాణించారు. ఆదివారం పూర్తిగా 425బస్సులు.. తిరుమల- తిరుపతి మధ్య 5,642 ట్రిప్పులు తిరిగి.. 2,16,753మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. నిమిషానికో బస్సు ఏర్పాటుచేసి సీబీఎస్, రైల్వే స్టేషన్, ఇతర పార్కింగ్ స్థలాల నుంచి భక్తులను తిరుమలకు.. అక్కడ్నుంచి మళ్లీ తిరుపతికి చేర్చారు. కాస్త గతేడాది కంటే దాదాపు 30వేల మందికి అదనంగా రవాణా సౌకర్యం కల్పించడం విశేషం. ఆ ఒక్క రోజులో తిరుమల ఘాట్ ద్వారా ఆక్యుపెన్సీ రేషియో 79శాతం నమోదుకాగా, టికెట్ల ద్వారా రూ.1.8కోట్లు వచ్చింది. ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని ప్రజా రవాణాధికారి జగదీష్ అభినందించారు.

సిక్కిం విద్యార్థుల 'మరోని' నృత్యార్చన

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా సిక్కిం బృందం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ప్రకాష్ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఉద్యోగులు 'మరోని' అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ కళాకారుల్లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవలకు అశ్వాలు దూరం

తిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోని వాహనసేవలకు అశ్వాలు(గుర్రాలు) దూరమయ్యాయి. తొలిరోజు పెద్దశేషవాహనం, మరుసటి రోజు చిన్నశేషవాహన సేవల మినహా మిగిలిన సేవల్లో ఇవి కనిపించలేదు. ఉత్సవ క్రమంలో రెండు గుర్రాలు బెదిరాయి. కొన్నిసార్లు శబ్దాలు కూడా చేశాయి. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా వీటిని గోశాలకు పరిమితం చేశారు. అశ్వవాహన సేవకు మాత్రమే తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. వైష్ణవి, పద్మావతి అనే రెండు ఏనుగులు కూడా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్నాయి. అయితే గరుడవాహన సేవ నుంచి రెండూ పాల్గొంటున్నాయి.

బాలుడి అప్పగింత



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుప్పం మండలం కెకెతొండ ప్రాంతానికి చెందిన మురుగేష్ కుటుంబం సోమవారం తిరుమలకు వచ్చింది. అఖిలాండం వద్ద మధ్యాహ్నం రద్దీలో మురుగేష్ కుమారుడు చైతన్య నాయక్ తప్పిపోయాడు. వీరు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. డిజిటల్ చైల్డ్ ట్యాగ్ సిస్టమ్ ద్వారా ఈ బాలుడిని గుర్తించి ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో తల్లి హంసకు అప్పగించారు.



పట్టాలు తప్పిన టవర్ కారు

రైల్వే సిబ్బంది మధ్య కరువైన సమన్వయం

- మోటకంపల్లె వద్ద పట్టాలు తప్పిన టవర్‌కార్
- ఆరేడుగంటలు ఆగిపోయిన పలు రైళ్లు

పూతలపట్టు/చిత్తూరు రూరల్/పాకాల/తిరుపతి సెంట్రల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రైలుమార్గంలో సోమవారం ఓ టవర్ కార్ పట్టాలు తప్పి పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.పూతలపట్టు -పాకాల స్టేషన్ల మధ్యలో సోమవారం రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులు జరిగాయి.పట్టాలతో పాటు విద్యుత్ లైన్లను సిబ్బంది పరిశీలించేందుకు 11.30గంటలనుంచి 1.30 గంటల దాకా ఇంటిగ్రేటెడ్ బ్లాక్ పేరుతో రాకపోకలను ఆపారు.అయితే 12గంటల సమీపంలో పి.కొత్తకోట సమీపంలోని మోటకంపల్లె వద్ద రైల్వే సిబ్బంది మధ్య సమన్వయం కరువై విద్యుత్ లైన్లు చెక్ చేసే ఓహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారు ఇంజన్ పట్టాలు తప్పింది. దీంతో తిరుపతి-చిత్తూరు మార్గంలో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఎక్కడికక్కడ స్టేషన్లలో ఆపేశారు.తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. రేణిగుంట నుంచి లూకాస్‌ను సంఘటనా స్థలానికి తీసుకెళ్లి ఈహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారును పట్టాలెక్కించి పాకాలకు తరలించేటప్పటికి సాయంత్రమైంది.రాత్రి 8గంటలకు మరమ్మతులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలను అధికారులు పునరుద్ధరించగలిగారు.శబరి,మన్నార్గుడి,వెంకటాద్రి, శేషాద్రి,భువనేశ్వరి, రామేశ్వరం, నాగర్‌కోయిల్,ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు తిరుపతి-కాట్పాడి ప్యాసింజరు తదితర రైళ్లు ఆరేడుగంటలు ఆలస్యంగా నడిచాయి. పూతలపట్టు రైల్వేస్టేషన్‌లో కోయంబత్తూరు నుండి తిరుపతి వెళ్ళే రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రైలు చిత్తూరు స్టేషన్‌లో గంటసేపు ఆగిపోవడంతో ప్రయాణికులు ఆరా తీశారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆగిందని రైల్వే సిబ్బంది చెప్పారు. అదే రైలు పూతలపట్టులో మళ్లీ ఆగిపోవడంతో ప్రయాణికులు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో టవర్ కారు పట్టాలు తప్పిందని, 2-3 గంటలు ఆలస్యం కావొచ్చని రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులు ఒకటిన్నర కిలోమీటరు దూరం కొంతమంది ఆటోల్లో, కొంతమంది నడుచుకుంటూ చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారికి చేరుకొని బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.బెంగళూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటల నుంచి పూతలపట్టు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది.మన్నార్‌గుడి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 1-30 నుంచి చిత్తూరులోనే ఆపేశారు. రామేశ్వరం-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను పాకాలలో నిలిపివేశారు. పాకాలకు సాయంత్రం 4 గంటలకు రావలసిన కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముంగిలిపట్టులోనే ఆపేశారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కాట్పాడిలో,హౌరా ఎక్స్‌ప్రెస్‌ను రామాపురంలో, తిరుపతి-కాట్పాడి, కాట్పాడి తిరుపతి డెము రైళ్లను నిలిపివేశారు. రాత్రి 8 గంటల వరకూ అవస్థలు పడిన ప్రయాణికులు తర్వాత లైన్ క్లియర్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



టవర్‌కారును పట్టాలపైకి చేరుస్తున్న లూకాస్



తిరుపతి స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు



పూతలపట్టు స్టేషన్ నుంచి నడిచివచ్చి బస్సెక్కుతున్న ప్రయాణికులు



పాకాల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రామేశ్వరం ఎక్స్‌ప్రెస్

కుటుంబమంతా అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులే!

- ఐదుగురికీ ఒకే విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు
- వారిలో నేడు స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ అందుకోనున్న తిరుపతికి చెందిన గాయత్రి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకటే కుటుంబం. భార్యాభర్తలు, వారికి ముగ్గురు సంతానం. పలు కారణాలతో సంప్రదాయ ఉన్నత విద్యకు దూరమైన వీరంతా డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులుగా.. తమ లక్ష్యమైన ఉన్నత విద్యను అభ్యసించారు. వీరిలో తాజాగా పీజీ పూర్తి చేసిన ఒకరు మంగళవారం జరిగే స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. తిరుపతికి చెందిన ఎస్.శ్రీధర్ అనే వ్యక్తి టీటీడీలో ఒక చిరుద్యోగి. ఆయనకు ఉన్నత విద్య చదవాలని లక్ష్యం, కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. కుటుంబ స్థితిగతుల నేపథ్యంలో చిన్న ఉద్యోగంలో చేరి ఆ తర్వాత వివాహం, పిల్లలు, వారి పోషణతో సరిపోయింది. అయినా ఉన్నత విద్యపై ఉన్న ఆసక్తికి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదికైంది. కుటుంబ స్థితిగతులు కొంత మెరుగయ్యాక అక్కడ ఆయన గతంలో ఓపెన్ విద్య విధానంలో డిగ్రీలో పూర్తి చేశారు. శ్రీధర్ భార్య ఉమాదేవికి కూడా ఉన్నత విద్యపై మక్కువే. చదువుపై ఆసక్తి ఉన్నా పిల్లల పెంపకం అడ్డంకిగా మారింది. అయినా అడ్డంకులను చేధించుకొని.. తన భర్త బాటలోనే అదే వర్సిటీలో డిగ్రీలో చేశారు. కుమారుడు కార్తీక్ కూడా సార్వత్రిక విద్యాలయం నుంచి ఎం.కామ్ పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్దకుమార్తె ఎస్.విద్య సైతం ఇదే వర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేశారు. చిన్న కుమార్తె ఎస్.గాయత్రి తాజాగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తిరుపతి అధ్యయన కేంద్రంలో ఎం.కామ్ పూర్తి చేసి, ఉత్తమ ప్రతిభతో బంగారు పతకానికి ఎంపికయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత వెనుకడుగు వేయొద్దని ఆమె అంటున్నారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఎం.కామ్ చదివానని తెలిపారు.



అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదువుకున్న తిరుపతికి చెందిన కుటుంబం

చదువుల తల్లీ దీవించమ్మా..


సూళ్లూరుపేట: సరస్వతీదేవి అలంకారంలో చెంగాళమ్మ


నాయుడుపేట: సరస్వతీదేవి అలంకారంలో మూకాంబికాదేవి


గూడూరు: సరస్వతీదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


చిల్లకూరు: సరస్వతీదేవి అలంకారంలో ఆదిలక్ష్మి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకానంతరం అమ్మవారికి పుష్పలంకరణ చేశారు. తరువాత యాగశాల మండపంలో మహాచండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. సూళ్లూరు, నాగరాజపురం, వాటంబేడు రోడ్డు గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారం, చండీయాగానికి నెల్లూరుకు చెందిన దువ్వూరు హరిప్రసాద్‌రెడ్డి, జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వీరికి సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వలంటరీ సంఘం సారె సమర్పించింది. నాగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదిరాయణరెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పోలేరమ్మ, మానసాదేవి, దుర్గాదేవి, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, జారుకలశం వద్ద అమ్మవారిని, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని, గ్రామదేవత తాళమ్మను సరస్వతిదేవి అలంకారంలో, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

చిల్లకూరు: మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని విద్యాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కోట: గూడలిలోని రామలింగ చాముండేశ్వరిని, కోట గ్రామదేవత కోటమ్మను, వాసవీ కన్యకా పరమేశ్వరిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరిని సరస్వతి దేవిగా, మూలవిరాట్‌కు ముత్యాల కవచం, కర్ణకమ్మ వీధిలోని కాత్యాయనీ దేవికి సరస్వతిదేవిగా, వెంకటేశ్వర స్వామికి బలరామా వతారం, మంద నాంచరేశ్వరికి సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పార్వతీదేవిని సరస్వతీదేవీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


గూడూరు: సరస్వతీదేవి అలంకారంలో గంగమ్మ


డక్కిలి: సరస్వతీదేవి అలంకరణలో పార్వతీదేవి


వెంకటగిరి: సరస్వతీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: సరస్వతీదేవి అలంకారంలో కోటమ్మ


చిట్టమూరు: సరస్వతీ అలంకారంలో కామాక్షీదేవి


సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న సూళ్లూరు, నాగరాజపురం గ్రామస్తులు

తగ్గిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు సాగించాలి

నాయుడుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు సాగించాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. సోమవారం పట్టణంలోని తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు దాదాపు రూ.15వేల వరకు ఆదా అవు తుందన్నారు. వ్యాపారులకు అమ్మకాలూ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SK.MAHAJEER BASHA (old Name), S/o SK.MASTHAN, R/o Gudur Town, Gudur (P&M), Tirupathi Dist, A.P - 524101.
I have changed my name to **SHAIK. MAJIR BABU** (New name as per school certificates). Hence forth, I shall be known as **SHAIK. MAJIR BABU** for all purposes.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

చిట్టమూరు, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపాళెం గ్రామంలో 60 కుటుంబాలకు చెందిన భూమిని ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించారని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ నరేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరిపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 16లో ఉన్న 26.06 ఎకరాల భూమిని 1974లో ప్రభుత్వం ఏడుగురికి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో ముగ్గురు ఎస్టీలకు 9, ముగ్గురు ఎస్సీలకు 15, ఒక బీసీ వ్యక్తికి 2.06 ఎకరాలు కేటాయించారని పేర్కొన్నారు. అయితే ఎవరూ ఆ భూములకు సాగు చేయకపోవడంతో బీడుగా ఉండేవి. ఇద్దరు గిరిజనలు కూడా మృతి చెందారు. ఈ నేపథ్యంలో 2007లో గ్రామస్తులందరూ కలిసి పట్టాదారులతో ఒప్పదం కుదుర్చుకొన్నారు. పట్టాదారులకు కొంత మిగిల్చి, 60 కుటుంబాలకు 26 సెంట్ల లెక్కన పంచుకున్నారు. అప్పటి నుంచి 60 కుటుంబాలకు చెందిన వారు సాగు చేసుకుంటుండగా రెవెన్యూ అధికారులు అడంగల్లో కూడా నమోదు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన రమణయ్య, సుబ్రహ్మణ్యం గ్రామస్తుల ఒప్పందానికి వ్యతిరేకంగా సదరు భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి రాత్రికిరాత్రే పొలాలను దున్నేస్తున్నారని కుమ్మరిపాళెంవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పందిస్తూ హామీ ఇచ్చారు.

11న మత్స్యకార సొసైటీ ఎన్నికలు

కోట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నక్క చెరువు, కేశవరం చెరువు మత్స్యకార సొసైటీలకు అక్టోబరు 11న ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నెల్లూరుపల్లి కొత్తపాళెంలోని పెన్నక్కమ్మతల్లి మత్స్యకార సొసైటీకి 9నామినేషన్లు, కేశవరం చెరువు మత్స్యకార సొసైటీకి 5 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు మహిజ, రఘు తెలిపారు.

కౌన్సిలర్‌కు పరామర్శ

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులురెడ్డిని వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర సోమవారం పరామర్శించారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్య


ధనంజయ్య (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ ఇట్టగుంట ధనంజయ్య(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో జరిగిన చిన్నపాటి వివాదంతో మనస్థాపం చెందిన ఆయన చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ కల్లూరుకు వెళ్లి ధనంజయ్య భౌతికాయానికి నివాళులర్పించారు.

కారు ఢీకొని బాలుడి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం తుమ్మూరు సమీపంలో కారు ఢీకొనడంతో దియ ర్యాయన్ (3) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తుమ్మూరులో నివాసం ఉంటున్న కిరణ్, వల్లెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు మహిధర్, దియర్యాయన్ ఉన్నారు. సోమవారం చిన్న కుమారుడు దియ ర్యాయన్ రోడ్డు పక్కన నిలబడి ఉండగా నాయుడుపేట నుంచి గూడూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలుడిని నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో దియర్యాయన్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు

డక్కిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో మోపూరు, లింగసముద్రం, ఆల్తూరుపాడు, గొల్లపల్లి సొసైటీల అధ్యక్షుడు పులి జనార్ధనరెడ్డి, కాసరం చైతన్య, నర్రావుల భాస్కరనాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గి వెంకటేశ్వర్లు, దండవోలు పెంచలరెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ధరల తగ్గింపు

గూడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పలు వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయని వాణిజ్య పన్నులశాఖ జిల్లా రిజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర అన్నారు. సోమవారం వాణిజ్య పనులశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. దీని వల్ల నిత్యావసరాలు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వాణిజ్యపనుల శాఖ అసిస్టెంట్ కమిసనర్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మునెయ్య మృతి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌వీకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయి మునెయ్య మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పాటు టీడీపీ నాయకులు బుజ్జయ్య, విజయకుమార్ తదితరులు ఉన్నారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోను రాజశేఖర్

డక్కిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ గోను రాజశేఖర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల మృతి చెందిన జడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, డి.వడ్డిపల్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మకు నివాళలర్పించారు. అనంతరం శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి గురించి అధికారులు సభ్యులకు వివరించారు. రైతులకు ఎకరాకు మూడు బస్తాలు వంతున యూరియా అందిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. అందరూ ఆర్వో వాటర్ పట్ల మొగ్గు చూపుతున్నారని, నీటిలో టీడీఎస్ శాతం తగ్గడం వల్ల అనారోగ్యం భారిన పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. గ్రామాల్లో పంచాయతీ ట్యాంకులు ద్వారా అందించే స్వచ్ఛమైన నీటిని వాడటం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలీక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై అలా జరగడానికి వీలులేదని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. సచివాలయ సిబ్బంది, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు సచివాలయంలో హజరు వేశాక, వారు ఎక్కడికి వెళుతున్నారో మూమెంట్ రిజిస్టరులో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. మండల సమావేశాలకు కొన్ని శాఖల అధికారులు మొక్కుబడిగా హజరవుతున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, మాధవాయపాళెం, లింగసముద్రం సొసైటీల అధ్యక్షులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగిన యువకుడి మృతి

డక్కిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ ఫైనాన్స్ నిర్వాహకులు అవమానకరంగా మాట్లాడడంతో పురుగుల మందుతాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... డక్కిలి మండలం నరసనాయుడుపల్లి గ్రామానికి చెందిన అనిల్(26) గూడూరులోని మాలవ్యనగర్‌లో ఉన్న ఓ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంటుగా పనిచేసేవాడు. కష్టమర్ల దగ్గర వసూలు చేసిన డబ్బులు సంస్థకు చెల్లించలేదంటూ ఆ సంస్థ సిబ్బంది అనిల్‌ను పలుమార్లు మందలించారు. ఇటీవల నరసనాయుడుపల్లి గ్రామానికి వచ్చి తల్లిదండ్రుల ఎదుట అవమానకంగా మాట్లాడారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్ అదేరోజున పురుగులు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్న సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.